
సంపుటి : 9
సంచిక : 341
బుధవారం
02 సెప్టెంబర్ 2026
పేజీలు : 12
వెల : 2/-
E-PAPER

# విశ్వవాయిస్

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY.
10 YEARS CELEBRATING
SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT
CERCULATED AT : • WEST GODAVARI • VISAKHAPATNAM • SRIKAKULAM • VIJAYANAGARAM • VIJAYAWADA • HYDERABAD • BANGLORE • CHENNAI, • DELHI • MUMBAI • TIRUPATHI • ANANTAPUR • GUNTUR • KADAPA • KHAMMAM • KARIMNAGAR • KURNOOL • NELLORE • NIZAMABAD • ONGOLE




Contact For Ads:
7579339999



## రాష్ట్రాభివృద్ధికి
# మీ సలహాలు, సూచనలు చెప్పండి

- పేదల ఆర్థిక సాధికారతే లక్ష్యంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని సీఎం చంద్రబాబు వెల్లడి
- మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తూ, డ్వాక్రా సంఘాలకు ప్రోత్సాహం అందిస్తామని హామీ
- నదుల అనుసంధానం ద్వారా రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేయడమే తన ఆశయమని స్పష్టీకరణ
- పెట్టుబడులను ఆకర్షించి యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని భరోసా



**మొగల్తూరు, సెప్టెంబర్ 01, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి ఇంకా బాగా జరగాలి.. అందుకోసం సలహాలు, సూచనలు చెప్పాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరులో ఏర్పాటుచేసిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంక్షేమం పేదవాడిని నిలబెట్టాలి.. తాత్కాలిక ఉపశమనం ఉండాలన్నారు. "ఆడ బిడ్డలు ఎక్కడికి వెళ్లాలన్నా.. ఉచిత బస్సులు తెచ్చాం. దీపం పథకం ద్వారా 3 సిలిండర్లు ఇస్తున్నాం. పేదల సేవ కోసమే మొగల్తూరు వచ్చాను. సీఎం స్థాయిలో అనేక మార్పులు చేశాను. ఎంత సేవ చేసినా మీ రుణం తీర్చుకోలేను. అనేక సంస్కరణలకు నాంది పలికాం.. ప్రజా చైతన్య కార్యక్రమాలు తెచ్చాం. ఎన్నికల్లో మీరిచ్చిన తీర్పును ఎన్నటికీ మర్చిపోలేను. వైకాపా హయాంలో రాష్ట్రానికి కోలుకోలేని నష్టం జరిగింది. కూటమిగా ఏర్పడి రాష్ట్రాన్ని మళ్లీ గాడిన పెడుతున్నాం. 45 సంవత్సరాలుగా వెనుకబడిన వర్గాలు తెదేపాని అంటిపెట్టుకునే ఉన్నాయి. ఆర్టీసీలో మహిళా కండక్టర్ల వ్యవస్థను తీసుకొచ్చాం. త్వరలో మహిళా డ్రైవర్ల వ్యవస్థను తీసుకొస్తాం. వడ్డెర సమాజిక వర్గానికి మైనింగ్ లీజులు పెట్టాం. గౌడ్ కులానికి మద్యంషాపులు కేటాయిస్తున్నాం. డీఎస్సీపై వైకాపా 350 కేసులు వేసింది. వైకాపా చేస్తోన్న ప్రచారాన్ని డీఎస్సీ ఉద్యోగులు వ్యతిరేకిస్తున్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా పింఛన్లు పెంచాం. పేదల పట్ల ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంది. పేదలకు చేయూతనిస్తే ఏదైనా సాధించే సత్తా ఉంటుంది" అని చంద్రబాబు అన్నారు.

**వైకాపా నేతలకు ఓటమి భయం పట్టుకుంది**

స్థానిక ఎన్నికల్లో ఎన్డీఏ విజయం సాధించనున్నట్లు అన్ని సర్వేలూ చెబుతున్నాయని సీఎం తెలిపారు. వైకాపా నేతలకు ఓడిపోతామనే భయం పట్టుకుందన్నారు. అందుకే ఏకగ్రీవాలు జరిగితే వదిలిపెట్టనంటూ గొడ్డలి పార్టీ నాయకుడు ఆ పార్టీ నేతలకు చెబుతున్నారని మండిపడ్డారు. ప్రజలు ఏకగ్రీవాలు చేస్తే మీరేం చేస్తారని వైకాపా నేతలను చంద్రబాబు ప్రశ్నించారు. "గ్రామాల్లో కావాల్సింది గొడవలు కాదు.. ఐకమత్యం. మండలాలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో ఆయారాం.. గయారాం సంస్కృతికి చెక్ పెట్టేందుకే ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహిస్తున్నాం. స్థానిక ఎన్నికలు జరిగితే చిత్తుచిత్తుగా ఓడిపోతామనే

మిగతా .. 2లో..

## ప్రపంచం తడబడుతున్నా..
# భారత్ దూసుకెళ్తోంది

**తొలి త్రైమాసికంలో భారత్ జీడీపీ 7.8% వృద్ధి**
**వృద్ధి దేశ ఆర్థిక బలానికి నిదర్శనమన్న పవన్**
**ప్రపంచ అనిశ్చితిపై భారత్ స్థైర్యం చాటిందని వెల్లడి**
**మోదీ నాయకత్వాన్ని ప్రశంసించిన పవన్ కల్యాణ్**



**అమరావతి, సెప్టెంబర్ 01, విశ్వం వాయిస్ న్యూస్ :** భారత్ జీడీపీ 2026-27 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో 7.8 శాతం వృద్ధి నమోదు చేయడం దేశ ఆర్థిక స్థైర్యం, విశ్వాసానికి నిదర్శనమని ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. ప్రపంచవ్యాప్తంగా యుద్ధాలు, భౌగోళిక ఉద్రిక్తతలు, చమురు ధరల్లో హెచ్చుతగ్గులు, సరఫరా వ్యవస్థలో అంతరాయాలు కొనసాగుతున్నా భారత్ తన బలాన్ని చాటుకుందని పేర్కొన్నారు. ఈ మేరకు పవన్ కల్యాణ్ మంగళవారం 'ఎక్స్' వేదికగా

మిగతా .. 2లో..

## హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు
# హైకోర్టులో ఊరట

**హైదరాబాద్, సెప్టెంబర్ 01, విశ్వం వాయిస్ న్యూస్ :** హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. శాంతా శ్రీరాం కన్‌స్ట్రక్షన్ కేసులో ఆయనపై సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును డివిజన్ బెంచ్ తాత్కాలికంగా సస్పెండ్ చేసింది. రంగనాథ్‌ను తప్పించి మరో అధికారిని నియమించాలని సింగిల్ జడ్జి గతంలో తీర్పు ఇచ్చారు. దీనిపై రంగనాథ్ డివిజన్ బెంచ్‌లో అప్పీల్ చేశారు. ఆ పిటిషన్‌పై నేడు విచారణ జరిగింది. హైడ్రా కమిషనర్ తరఫున హిమాచల్‌ప్రదేశ్ హైకోర్టు మాజీ సీజే జస్టిస్ రాజీవ్ శక్దర్ వాదనలు వినిపించారు.

## రాజకీయాల్లో మార్పు కోసం
# జనసేన యువజన విభాగం

**జనసేన పీఏసీ ఛైర్మన్, మంత్రి నాదెండ్ల మనోహర్**



**పిఠాపురం, సెప్టెంబర్ 01, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజకీయాల్లో మార్పు.. కొత్తతరం ఆలోచనలను సమాజానికి అందించడానికి యువజన విభాగం నిబద్ధతతో పని చేస్తుందని జనసేన పీఏసీ ఛైర్మన్, మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పుట్టిన రోజు సందర్భంగా సెప్టెంబర్ 2న జనసేన పార్టీ యువజన విభాగం ఏర్పాటు కార్యక్రమాన్ని పిఠాపురంలో నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లను పిఠాపురంలో మంత్రి నాదెండ్ల మనోహర్ మంగళవారం

మిగతా .. 2లో..

# 'అక్షర ఆంధ్ర'తో సత్ఫలితాలు

- వచ్చే సెప్టెంబరుకు 100 శాతం అక్షరాస్యత : మంత్రి నారా లోకేశ్
- పాఠశాల విద్య, ఇంటర్మీడియట్ విద్య శాఖలపై మంత్రి నారా లోకేశ్ సమీక్ష
- అక్షర ఆంధ్ర కార్యక్రమంతో ఏడాదిలో 25 లక్షల మందికి అక్షరజ్ఞానం
- బడిబయట ఉన్న 1.64 లక్షల మంది పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని ఆదేశం
- మధ్యాహ్న భోజనంపై ఫీడ్‌బ్యాక్ ఇవ్వాలని తల్లిదండ్రులకు, టీచర్లకు సూచన



**అమరావతి, సెప్టెంబర్ 01, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలో విద్యావ్యవస్థను బలోపేతం చేసి, సంపూర్ణ అక్షరాస్యత సాధించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. 'అక్షర ఆంధ్ర' కార్యక్రమం ఉద్యమంలా సాగుతోందని, దీని ద్వారా వచ్చే ఏడాది సెప్టెంబర్ నాటికి రాష్ట్రాన్ని వంద శాతం అక్షరాస్యత సాధించిన రాష్ట్రంగా నిలపాలని అధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు. ఉండవల్లిలోని తన నివాసంలో మంగళవారం పాఠశాల విద్య, ఇంటర్మీడియట్ విద్య శాఖల ఉన్నతాధికారులతో మంత్రి నారా లోకేశ్ సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సందర్భంగా విద్యావ్యవస్థలో చేపడుతున్న

మిగతా .. 2లో..

## వికటించిన మలేరియా మాత్రలు..?
ఒకరి మృతి..
45 మందికి అస్వస్థత



**ఎటపాక, సెప్టెంబర్ 01, విశ్వం వాయిస్ న్యూస్ :** పోలవరం జిల్లా ఎటపాక మండలం గొల్లగుప్పలో విద్యార్థిని జమున(7) మృతి చెందగా.. 45 మంది అస్వస్థతకు గురయ్యారు. మలేరియా మాత్రలు వికటించడమే కారణమని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. మూడు రోజుల క్రితం గ్రామంలో ఓ విద్యార్థి కడుపునొప్పితో మృతి

మిగతా .. 2లో..

## పులివెందులలో జగన్‌కు
# ఘనస్వాగతం పలికిన వైసీపీ శ్రేణులు

**రెండు రోజుల పర్యటన నిమిత్తం పులివెందుల చేరుకున్న జగన్**
**తన క్యాంప్ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించిన వైసీపీ అధినేత**
**నేడు వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొననున్న జగన్**



**పులివెందుల, సెప్టెంబర్ 01, విశ్వం వాయిస్ న్యూస్ :** వైసీపీ అధినేత జగన్ రెండు రోజుల పర్యటన నిమిత్తం పులివెందులకు చేరుకున్నారు. సెప్టెంబర్ 1, 2 తేదీల్లో సాగనున్న ఈ పర్యటనలో భాగంగా ఈరోజు మధ్యాహ్నం 12 గంటలకు ఆయన పులివెందుల చేరుకోగా... హెలిప్యాడ్ వద్ద పార్టీ నాయకులు, స్థానిక శ్రేణులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. పర్యటనలో భాగంగా

మిగతా .. 2లో..

## కాంగ్రెస్ అధిష్ఠానం పిలుపు..
# ఢిల్లీకి మంత్రి కొండా సురేఖ



**హైదరాబాద్, సెప్టెంబర్ 01, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలంగాణ మంత్రి కొండా సురేఖ ఢిల్లీకి బయల్దేరారు. కాంగ్రెస్ అధిష్ఠానం పిలుపు నేపథ్యంలో ఆమె వెళ్లారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో సురేఖ సమావేశం కానున్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అపాయింట్‌మెంట్‌ను కూడా ఆమె కోరారు. ఇటీవల గీసుకొండలో సీఎం రేవంత్‌రెడ్డి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిపై కొండా సురేఖ కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశమైన

మిగతా .. 2లో..

# ఏపీకి మరో 13 నవోదయలు, రెండో ఎయిమ్స్ ఇవ్వండి

**నిర్మలా సీతారామన్‌ను కలిసిన లింగమనేని రమేశ్**
**ఏపీలో కేవలం 15 జిల్లాల్లోనే నవోదయ విద్యాలయాలు ఉన్నాయన్న ఎంపీ**



**అమరావతి, సెప్టెంబర్ 01, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ సమగ్ర అభివృద్ధి, వైద్య విద్యా విస్తరణను ఆకాంక్షిస్తూ జనసేన రాజ్యసభ సభ్యుడు లింగమనేని రమేశ్ కేంద్ర ప్రభుత్వానికి కీలక విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో కొత్తగా మరో 13 జవహర్ నవోదయ విద్యాలయాల ఏర్పాటుతో పాటు, రెండో 'ఎయిమ్స్' మంజూరుకు అవసరమైన ఆర్థిక

మిగతా .. 2లో..

# విజయసాయిపై సజ్జల దాడి నిజమే

**నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి**



**మంగళగిరి, సెప్టెంబర్ 01, విశ్వం వాయిస్ న్యూస్ :** తనపై భౌతిక దాడి జరిగిందంటూ మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి చేసిన ఆరోపణలు నిజమేనని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ధ్రువీకరించారు. 2022లో మంగళగిరిలో జరిగిన వైసీపీ

మిగతా .. 2లో..




## 1,000 దాటిన మరణాలు..
# 700 మృతదేహాలు సామూహిక ఖననం



**సెప్టెంబర్ 01, విశ్వం వాయిస్ న్యూస్ :** నేపాల్ వరదల్లో గల్లంతైన వారి కోసం ఆరో రోజూ సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో ఇప్పటివరకు 1003 మృతదేహాలను సహాయక బృందాలు వెలికితీశాయి. సుమారు 4వేల మంది ఆచూకీ ఇంకా లభించలేదు. వీరిలో 583 మంది విదేశీయులు, 83 మంది భద్రతా సిబ్బంది ఉన్నారు. ఇప్పటివరకు 12 వేల మందిని భద్రతా దళాలు రక్షించినట్లు అధికారులు వెల్లడించారు. మరోవైపు, టిబెట్‌లో 16 మంది ప్రాణాలు కోల్పోగా.. 550 మంది ఆచూకీ లభించలేదని చైనా మీడియా పేర్కొంది.

**700 మృతదేహాలు ఖననం..**

ఆయా ప్రాంతాల్లో వెలికితీసిన మృతదేహాలను దేశవ్యాప్తంగా

మిగతా .. 2లో..

# ఏపీలో 'సర్' గడువు పెంపు

**అమరావతి, సెప్టెంబర్ 01, విశ్వం వాయిస్ న్యూస్ :** ఏపీలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) గడువును కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) పొడిగించింది. ఈ నెల 10 వరకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. క్లెయిమ్స్, అభ్యంతరాల పరిష్కారానికి అక్టోబర్ 5 వరకు అవకాశం ఇచ్చింది. అక్టోబర్ 9న తుది ఓటర్ల జాబితా విడుదల చేయనుంది.

## తిరుపతి ఎయిర్‌పోర్ట్‌లో
# మారిన విమాన సర్వీసుల వేళలు

**ఇండిగో, స్టార్ ఎయిర్, ఎయిర్ ఇండియా సర్వీసుల టైమింగ్స్‌లో మార్పులు**
**హైదరాబాద్, ఢిల్లీ, విశాఖ మార్గాల్లో కొత్త సమయాలు**
**ప్రయాణానికి ముందు సమయాలు చూసుకోవాలని ప్రయాణికులకు సూచన**




**తిరుపతి, సెప్టెంబర్ 01, విశ్వం వాయిస్ న్యూస్ :** తిరుపతి విమానాశ్రయం నుంచి రాకపోకలు సాగించే పలు విమాన సర్వీసుల వేళల్లో మార్పులు చోటు చేసుకున్నాయి. ఈ నూతన షెడ్యూల్ సెప్టెంబర్ 1, 2026 (మంగళవారం) నుంచి అమల్లోకి వచ్చినట్లు విమానాశ్రయ అధికారులు వెల్లడించారు. ప్రయాణికులు తమ ప్రయాణానికి ముందు

మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

# రాష్ట్రాభివృద్ధికి మీ సలహాలు, సూచనలు చెప్పండి

భయంతో వైకాపా నేతలు 'సర్' పేరిట హైకోర్టుకు వెళ్లారు. ఎన్నికలు నిర్వహించకపోతే ఆర్థిక సంఘం నుంచి నిధులు నిలిచిపోతాయి" అని సీఎం అన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ, రాష్ట్ర మంత్రులు నిమ్మల రామానాయుడు, గొట్టిపాటి రవికుమార్, ఉపసభాపతి రఘురామకృష్ణరాజు తదితరులు పాల్గొన్నారు.

**మహిళా సాధికారత నుంచి సామాజిక న్యాయం వరకు**

మహిళా సాధికారతకు తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని చంద్రబాబు అన్నారు. పొదుపు ఉద్యమానికి శ్రీకారం చుట్టిన డ్వాక్రా సంఘాల ద్వారా మహిళలను ఆర్థికంగా నిలబెట్టామని, ఇప్పుడు 'దీపం-2.0' పథకం ద్వారా ప్రతి పేద కుటుంబానికి ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నామని తెలిపారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించి వారిని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలుపుతున్నామని చెప్పారు. గత ఏడాది లక్ష మంది డ్వాక్రా మహిళలు ఎంఎస్ఎంఈలుగా ఎదిగారని, ఈ లక్ష్యాన్ని మరింత పెంచుతామని, వారు తయారు చేసే ఉత్పత్తులకు 'స్వయం' బ్రాండ్‌తో మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. అలాగే 'స్త్రీశక్తి' కార్యక్రమం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించి వారిపై ఆర్థిక భారం తగ్గించామని అన్నారు. సంక్షేమం అంటే కేవలం డబ్బులు పంచడం కాదని, అన్ని వర్గాల ప్రజలను అభివృద్ధిలోకి తీసుకురావడమేనని సీఎం పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల్లో ఇంకా ఉన్న వెనుకబాటుతనాన్ని రూపుమాపేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందులో భాగంగా వడ్డెర్లకు మైనింగ్‌లో, గీత కార్మికులకు మద్యం దుకాణాల్లో రిజర్వేషన్లు కల్పించామని, మత్స్యకారులకు వేట నిషేధ సమయంలో రూ.20 వేల ఆర్థిక సాయం అందిస్తున్నామని తెలిపారు. చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్ ఇస్తున్నామని, దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ఎస్సీ వర్గీకరణను అమలు చేసి సామాజిక న్యాయం చేశామని గుర్తుచేశారు.

**అభివృద్ధి, సాంకేతికతతో నవశకం**

నదుల అనుసంధానంతో రాష్ట్రంలో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. వెలిగొండ ప్రాజెక్టు ద్వారా కరవు నేలకు కృష్ణా జలాలు అందించామని, శ్రీశైలం నుంచి మార్కాపురం వరకు నీళ్లు పారించడం తన జీవితంలో ఎనలేని ఆనందాన్ని ఇచ్చిందన్నారు. రేపు గోదావరి జలాలను ఉత్తరాంధ్రకు తరలించబోతున్నామని, గోదావరి నీటిని అనకాపల్లి, విశాఖ మీదుగా వంశధార వరకు తీసుకెళ్తామని ప్రకటించారు. గత పాలకులు పరిశ్రమలను తరిమేసి యువత భవిష్యత్తును అంధకారం చేశారని విమర్శించారు. తమ ప్రభుత్వం పెద్ద ఎత్తున పెట్టుబడులను ఆకర్షిస్తోందని, విద్యుత్ సంస్థలను సమర్థంగా నిర్వహిస్తూ 'ట్రూ డౌన్' ద్వారా ఛార్జీల భారాన్ని తగ్గించామని తెలిపారు. ఆక్వా రైతులకు యూనిట్ విద్యుత్‌ను కేవలం రూ.1.5కే అందిస్తున్నామని, ప్రపంచ మార్కెట్లో ఏపీ ఆక్వా ఉత్పత్తులను అగ్రస్థానంలో నిలుపుతామని అన్నారు. ప్రజా పాలనలో సాంకేతికతను విరివిగా ఉపయోగిస్తామని, ఏఐ ట్యూటర్, ఏఐ డాక్టర్ వంటి వ్యవస్థలను ప్రజలకు అందుబాటులోకి తెస్తామని, 1.60 కోట్ల కుటుంబాలకు ఆన్‌లైన్‌లోనే ప్రభుత్వ సేవలు అందించే వ్యవస్థను రూపొందిస్తామని వెల్లడించారు. నర్సాపురం అభివృద్ధికి ఆక్వా కల్చర్ యూనివర్సిటీ, డంప్ యార్డు, డెల్టా ఆధునికీకరణ పనులు చేపడతామని హామీ ఇచ్చారు.

**ఏకగ్రీవాలు వద్దనడం వారి ఓటమి భయానికి నిదర్శనం**

రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా ఎన్డీఏ కూటమిదే విజయమని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. ఓటమి భయంతోనే 'గొడ్డలి పార్టీ' స్థానిక సంస్థల ఎన్నికలు జరగకుండా అడ్డుకునేందుకు కుట్రలు చేస్తోందని ఆరోపించారు. ఏకగ్రీవాలను వద్దనడం వారి ఓటమి భయానికి నిదర్శనమని, గతంలో ప్రభుత్వాలే ఏకగ్రీవాలను ప్రోత్సహించాయని గుర్తుచేశారు. ఆయారాం-గయారాంలను అరికట్టేందుకు మేయర్, చైర్మన్ ఎన్నికలను ప్రత్యక్ష పద్ధతిలో పెట్టామని తెలిపారు. బీసీ రిజర్వేషన్లను కూడా తగ్గించి ఆ వర్గాలకు అన్యాయం చేశారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, గొట్టిపాటి రవికుమార్, ఉపసభాపతి రఘురామ కృష్ణంరాజు, కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, విప్ బొలిశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**చిరంజీవి సొంతూర్లో చంద్రబాబు పడవ ప్రయాణం..**

ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం పశ్చిమ గోదావరి జిల్లాలో పర్యటించారు. టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవి సొంతూరైన నర్సాపురం నియోజకవర్గంలోని మొగల్తూరులో ఆయన పర్యటన ఆసక్తికరంగా సాగింది. 'పేదల సేవలో' కార్యక్రమం కోసం వచ్చిన ఆయన, స్థానిక మత్స్యకారులతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారి ఆప్యాయమైన ఆహ్వానం మేరకు పడవలో ప్రయాణించి అందరినీ ఆశ్చర్యపరిచారు. పర్యటనలో భాగంగా తొలుత ఫెర్రీ పాయింట్‌కు చేరుకున్న సీఎం చంద్రబాబు, అక్కడ పడవల వద్ద ఉన్న మత్స్యకారులతో ముచ్చటించారు. తిరుమని స్వామి అనే మత్స్యకారుడికి స్వయంగా పింఛను అందజేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా అని వారిని అడిగి తెలుసుకున్నారు. దీనిపై స్పందించిన మత్స్యకారులు, వేట నిషేధ సమయంలో ప్రభుత్వం అందిస్తున్న రూ.20 వేల ఆర్థిక సాయం తమ కుటుంబాలకు ఎంతో ఆసరాగా నిలుస్తోందని ముఖ్యమంత్రికి వివరించారు. సీఎంతో సంభాషణ సందర్భంగా ఓ మత్స్యకారుడు తమతో పాటు పడవలోకి రావాలని ఆప్యాయంగా ఆహ్వానించారు. ఆ ఆహ్వానాన్ని చిరునవ్వుతో స్వీకరించిన చంద్రబాబు, వెంటనే పడవ ఎక్కి వారితో కలిసి కాసేపు ప్రయాణించారు. ఈ ప్రయాణంలో, సముద్రంలో వారి జీవనశైలి గురించి ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. "వేటకు వెళ్లినప్పుడు ఎన్ని రోజులు సముద్రంలో ఉంటారు? ఆ సమయంలో భోజన సదుపాయాలు ఎలా ఉంటాయి?" వంటి వివరాలను అడిగి వారి కష్టసుఖాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సముద్రంలో మత్స్యకారులు గల్లంతవుతున్న ఘటనలపై చంద్రబాబు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల కోనసీమకు చెందిన మత్స్యకారులు దాదాపు 20 రోజులు సముద్రంలో చిక్కుకుపోయినప్పుడు, కోస్ట్‌గార్డ్, నేవీ వంటి కేంద్ర విభాగాల సహకారంతో వారిని ఎలా సురక్షితంగా వెనక్కి తీసుకొచ్చారో గుర్తుచేశారు. మత్స్యకారుల భద్రతకు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, వారికి అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అధికారిక కార్యక్రమానికి హాజరైనప్పటికీ, చంద్రబాబు నేరుగా మత్స్యకారుల వద్దకు వెళ్లి, వారి పడవలో ప్రయాణించి వారిలో ఒకరిగా కలిసిపోవడం స్థానికులను ఆకట్టుకుంది.

**ప్రపంచం తడబడుతున్నా..**

# భారత్ దూసుకెళ్తోంది

స్పందించారు. జీడీపీ వృద్ధి కేవలం ఒక సంఖ్య కాదని, దేశ ప్రజల సమష్టి శక్తిని ప్రతిబింబిస్తోందని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో సవాళ్లను అవకాశాలుగా మార్చుకుంటూ దేశం ముందుకు సాగుతోందన్నారు. 2014 నుంచి భారత్ ఆర్థికంగా మరింత బలపడిందని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. స్వయం సమృద్ధి, డిజిటల్ రంగం, మౌలిక వసతుల అభివృద్ధిలో గణనీయమైన మార్పులు వచ్చాయని తెలిపారు. యువత పెద్ద కలలు కనడంతో పాటు ఆవిష్కరణలు, వ్యాపారాలు, సాంకేతిక రంగంలో ముందుకు సాగేందుకు అవకాశాలు పెరిగాయని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా అనిశ్చిత పరిస్థితులు ఉన్నా భారత్ అభివృద్ధి పథంలో కొనసాగుతోందని పవన్ కల్యాణ్ అన్నారు. ప్రపంచ వేదికపై దేశానికి విశ్వసనీయత, ప్రాధాన్యం పెరిగిందని పేర్కొన్నారు. బలమైన, స్వయం సమృద్ధి, భవిష్యత్ సవాళ్లను ఎదుర్కొనే దేశంగా 'వికసిత్ భారత్' దిశగా అడుగులు పడుతున్నాయని తెలిపారు.

**రాజకీయాల్లో మార్పు కోసం**

# జనసేన యువజన విభాగం

పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'పిఠాపురంలో జనసేన పార్టీ యువజన విభాగం అంగరంగ వైభవంగా ప్రారంభం కాబోతోంది. ఇందుకు సంబంధించిన ప్రత్యేక గీతం, లోగోను పిఠాపురం వేదికగా బుధవారం ఆవిష్కరిస్తాం. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 25 పార్లమెంటు నియోజకవర్గాలు, 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో యువజన విభాగం ఆవిష్కరణ ఉత్సవాలను పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహిస్తారు. బైక్ ర్యాలీలు చేస్తారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో యువత, మహిళల ప్రాధాన్యంతోనే జనసేన ముందడుగు వేస్తుంది. యువతను పార్టీ సంస్థాగత నిర్మాణంలోనూ భాగస్వామ్యం కల్పించాలని పవన్ కల్యాణ్ ఆలోచిస్తారు. యువతలో గొప్ప స్ఫూర్తి నింపేలా యువజన విభాగం ఎల్లప్పుడూ పని చేస్తుందని' మంత్రి మనోహర్ అన్నారు.

# 'అక్షర ఆంధ్ర'తో సత్ఫలితాలు

సంస్కరణలు, కార్యక్రమాల పురోగతిని ఆయన సమీక్షించారు. ఈ సమావేశంలో మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ... 2024 నాటికి రాష్ట్ర అక్షరాస్యత శాతం కేవలం 72.6 శాతంతో దేశంలోనే అట్టడుగున ఉందని, అయితే గత ఏడాదిగా కూటమి ప్రభుత్వం తీసుకున్న చర్యలతో కేవలం ఒక్క ఏడాదిలోనే 25 లక్షల మంది నిరక్షరాస్యులు అక్షరాస్యులుగా మారారని తెలిపారు. ఈ కృషిని కేంద్ర ప్రభుత్వం కూడా అభినందించిందని అధికారులు మంత్రి దృష్టికి తీసుకురాగా, ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఇటీవల కేంద్రం విడుదల చేసిన వయోజన విద్య పరీక్షా ఫలితాల్లో రాష్ట్ర అక్షరాస్యత శాతం 10 శాతం పెరిగి 82.1 శాతానికి చేరుకుందని, ఇదే స్ఫూర్తితో 2027 సెప్టెంబర్ నాటికి సంపూర్ణ అక్షరాస్యత సాధించాలని కోరారు. ఇందుకు అనుగుణంగా 2027 మార్చి నాటికి మరో 25 లక్షల మందిని, ఆపై సెప్టెంబర్ నాటికి మిగిలిన 27 లక్షల మందిని అక్షరాస్యులుగా మార్చేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు అధికారులు వివరించారు. 11 ప్రభుత్వ శాఖల సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామని తెలిపారు. ఈ బృహత్ కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు, ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేసి, ప్రజల్లో విస్తృత చైతన్యం తీసుకురావాలని మంత్రి నారా లోకేశ్ సూచించారు.

**బడిబయట పిల్లలందరినీ బడిలో చేర్పించాలి**

పాఠశాల విద్యపై సమీక్షిస్తూ, రాష్ట్రంలో బడిబయట ఉన్న 1,64,821 మంది పిల్లలను గుర్తించి, వారందరినీ పాఠశాలల్లో చేర్పించేందుకు అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని మంత్రి నారా లోకేశ్ ఆదేశించారు. ఈ ఏడాది ఇప్పటికే 33 వేల మందిని పాఠశాలల్లో చేర్పించామని, మిగిలిన వారి వివరాలను 'లీప్' యాప్ ద్వారా ప్రధానోపాధ్యాయులకు పంపామని పాఠశాల విద్య డైరెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. పిల్లలను బడికి పంపేలా తల్లిదండ్రులను చైతన్యవంతం చేస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో ఉపాధ్యాయుల హాజరు శాతం 98.97 శాతంగా ఉండటంపై సంతృప్తి వ్యక్తం చేసిన మంత్రి, విద్యార్థుల హాజరు శాతాన్ని కూడా పెంచాలని సూచించారు. వరుసగా మూడు రోజులు బడికి రాని విద్యార్థుల తల్లిదండ్రులను పాఠశాలకు పిలిపించి కౌన్సిలింగ్ ఇవ్వాలని, ఈ బాధ్యతను పాఠశాల యాజమాన్య కమిటీలకు అప్పగించాలని స్పష్టం చేశారు.

**ఇంటర్ విద్యలో పురోగతి**

ఈ ఏడాది ఇంటర్మీడియట్ రెండో సంవత్సరంలో మంచి ఉత్తీర్ణత సాధించామని, గత ఏడాదితో పోలిస్తే సుమారు 10 వేల అడ్మిషన్లు పెరిగాయని ఇంటర్మీడియట్ విద్య కమిషనర్ రంజిత్ బాషా తెలిపారు. చదువులో వెనుకబడిన విద్యార్థుల కోసం 'సంకల్ప్ అకడమిక్ సపోర్ట్ ప్రోగ్రామ్' కింద ప్రత్యేక తరగతులు నిర్వహించేందుకు రూట్ మ్యాప్ సిద్ధం చేశామన్నారు. 'తల్లికి వందనం' పథకం ద్వారా ఈ ఏడాది ఇంటర్ విద్యార్థులకు రూ.1051 కోట్లు అందించామని, మొదటి సంవత్సరం విద్యార్థులకు కూడా త్వరలో అందిస్తామని చెప్పారు. ఇంటర్ విద్యార్థులకు సంబంధించి నూరుశాతం అపార్ ఐడీ ఇంటిగ్రేషన్ పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు.

**మధ్యాహ్న భోజనం నాణ్యతపై రాజీ లేదు**

మధ్యాహ్న భోజనం పథకం నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడేది లేదని మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. నాణ్యతపై ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు 'లీప్' యాప్ ద్వారా ఎప్పటికప్పుడు ఫీడ్‌బ్యాక్ అందించాలని కోరారు. అలాగే, విద్యార్థుల్లో ఒత్తిడి లేని అభ్యసన వాతావరణాన్ని కల్పించడంపై ఉపాధ్యాయులు దృష్టి సారించాలని సూచించారు. ఉపాధ్యాయులకు ఏఐ టూల్స్‌పై శిక్షణ ఇచ్చేందుకు 'ఏఐ సమర్థ్' కార్యక్రమం చేపడుతున్నామని, ఈనెల 5న ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా 192 మంది ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తామని అధికారులు తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు స్పెషల్ టెట్ నిర్వహణ, పదో తరగతి విద్యార్థుల కోసం 'మిషన్ మార్చి-2026'పై కూడా సమావేశంలో చర్చించారు. రాష్ట్రవ్యాప్తంగా 125 కేంద్రాల్లో ఆటిజం సెంటర్లు ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో విద్యాశాఖ కార్యదర్శి శ్యామలరావు, సమగ్రశిక్ష స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి. శ్రీనివాసరావు, పాఠశాల విద్య మౌలిక సదుపాయాల సంస్థ ఎండీ దీవెన్ రెడ్డి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# వికటించిన మలేరియా మాత్రలు..?

చెందాడు. వైద్య శిబిరం ఏర్పాటు చేసిన ఆరోగ్యశాఖ అధికారులు మలేరియా నిర్ధరణ పరీక్షలు నిర్వహించగా.. నలుగురికి మలేరియా సోకినట్లు తేలింది. దీంతో వైద్య బృందం గ్రామంలో మలేరియా మాత్రలు పంపిణీ చేసింది. వాటిని మింగడంతోనే విద్యార్థి మృతి చెందగా.. మరో 45 మంది అస్వస్థతకు గురైనట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. 40 మందిని భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించగా.. కొందరికి లక్ష్మీపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స అందిస్తున్నారు. బాధితుల్లో ఇద్దరు చిన్నారుల పరిస్థితి విషమంగా ఉంది. బాధితులను ఐటీడీఏ పీవో శుభం నొక్వాల్ పరామర్శించి, పరిస్థితిని సమీక్షించారు.

**పులివెందులలో జగన్‌కు**

# ఘనస్వాగతం పలికిన వైసీపీ శ్రేణులు

జగన్ భాకరాపురంలోని తన క్యాంప్ కార్యాలయంలో 'ప్రజాదర్బార్' నిర్వహించారు. సొంత నియోజకవర్గం పులివెందులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన ప్రజల నుంచి వినతులను స్వీకరిస్తూ, వారి సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. ఈ రాత్రికి ఆయన పులివెందులలోని తన స్వగృహంలోనే బస చేయనున్నారు. రేపు ఉదయం 7.45 గంటలకు జగన్ ఇడుపులపాయకు బయల్దేరి వెళతారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్ వద్ద ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని, నివాళులు అర్పిస్తారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం ఆయన తాడేపల్లికి తిరుగు ప్రయాణం కానున్నారు.

**కాంగ్రెస్ అధిష్ఠానం పిలుపు..**

# దిల్లీకి మంత్రి కొండా సురేఖ

సంగతి తెలిసిందే. కుమార్తె వ్యాఖ్యలపై వివరణ ఇవ్వాలని కొండా సురేఖకు టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ (డీఏసీ) షోకాజ్ నోటీసులు ఇచ్చింది. కమిటీ చైర్మన్ మల్లు రవికి ఆమె వివరణ ఇచ్చారు. అనంతరం కొండా సురేఖతో పాటు వనపర్తి వ్యవహారంలో ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డిపై రూపొందించిన నివేదికను అధిష్ఠానానికి టీపీసీసీ పంపింది. ఈ పరిణామాల నేపథ్యంలో మంత్రి కొండా సురేఖ దిల్లీకి వెళ్లడం.. ఆమె విషయంలో అధిష్ఠానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోననే ఉత్కంఠ నెలకొంది.

**మంత్రివర్గ విస్తరణపై జోరుగా ప్రచారం..**

తెలంగాణ మంత్రివర్గ విస్తరణపై హస్తినలో జోరుగా ప్రచారం జరుగుతోంది. మంత్రివర్గంలో మార్పులు, చేర్పులపై కాంగ్రెస్ అధిష్ఠానం కీలక నిర్ణయం తీసుకోవచ్చని రాజకీయ వర్గాల్లో చర్చ కొనసాగుతోంది. నామినేటెడ్ పదవుల భర్తీపైనా నిర్ణయం ఉండే అవకాశముందని కాంగ్రెస్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. మంత్రివర్గ విస్తరణ, పదవుల పంపకాల ప్రచారం నేపథ్యంలో రాష్ట్ర కాంగ్రెస్ ముఖ్యనేతలు దిల్లీ బాటపట్టారు. సీఎం రేవంత్‌రెడ్డి కొద్దిసేపటి క్రితమే దిల్లీ చేరుకున్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు ఇప్పటికే అక్కడ ఉన్నారు. అయితే పలువురు నేతలు మాత్రం బుధవారం స్వామినాథన్ ఫౌండేషన్‌కి వైఎస్ అవార్డు ప్రదాన కార్యక్రమం కోసం దిల్లీ వెళ్తున్నట్లు చెబుతున్నారు.

# ఏపీకి మరో 13 నవోదయలు, రెండో ఎయిమ్స్ ఇవ్వండి

సహాయం అందించాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మాలా సీతారామన్‌ను కోరారు. ఈ మేరకు ఆమెను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. అనంతరం లింగమనేని మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రస్తుతం 28 జిల్లాలు ఉండగా కేవలం 15 జిల్లాల్లోనే నవోదయ విద్యాలయాలు ఉన్నాయని వివరించారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన ఆర్థికంగా వెనుకబడిన ప్రతిభావంతులైన విద్యార్థులకు నాణ్యమైన ఉచిత రెసిడెన్షియల్ విద్యను అందించడంలో ఇవి కీలకపాత్ర పోషిస్తున్నాయన్నారు. గతంలో కేంద్ర మంత్రివర్గం ఐదేళ్ల కాలానికి రూ. 2,359.82 కోట్లతో దేశవ్యాప్తంగా 28 నవోదయల ఏర్పాటుకు ఆమోదం తెలిపిన ప్రాతిపదికన, ఏపీలోని మిగిలిన 13 జిల్లాల్లో జేఎన్వీల ఏర్పాటుకు దాదాపు రూ. 1,096 కోట్ల మేర నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే రాష్ట్రంలో రెండో ఎయిమ్స్ ఏర్పాటు అత్యంత అవసరమని పేర్కొన్నారు. 2014 విభజన తర్వాత మంగళగిరిలో ఒక ఎయిమ్స్ ఏర్పాటైనప్పటికీ, విస్తృతమైన రీతిలో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు, వైద్య విద్య, పరిశోధనలను విస్తరించేందుకు ప్రాథమిక బడ్జెట్ కేటాయింపులతో డీపీఆర్ తయారు చేసి రెండో ఎయిమ్స్ నిర్మాణానికి మూలధన నిధులు ఇవ్వాలని కోరారు. ఈ నిర్ణయాలు 'వికసిత్ భారత్ ఏ2047', జాతీయ విద్యా విధానం-2020 లక్ష్యాలకు అనుగుణంగా ఉంటాయని, కేంద్ర ప్రభుత్వం ఈ విజ్ఞప్తులపై సానుకూలంగా స్పందిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# విజయసాయిపై సజ్జల దాడి నిజమే

ప్లీనరీ సమావేశంలో సజ్జల రామకృష్ణారెడ్డి తనపై దాడి చేశారని, ఈ విషయం అధినేత జగన్‌కు తెలిసినా ఆయన ప్రేక్షకపాత్ర వహించారని విజయసాయిరెడ్డి ఇటీవల ఓ బహిరంగ లేఖలో ఆరోపించిన విషయం తెలిసిందే. ఈ ఆరోపణలపై సజ్జల నేరుగా స్పందించనప్పటికీ, అప్పట్లో వైసీపీలో ఉన్న కోటంరెడ్డి ఈ ఘటనపై స్పందించి కీలక విషయాలు బయటపెట్టారు. మంగళగిరి ప్లీనరీలో వేదికపై ఎవరితో మాట్లాడించాలనే అంశంపై విజయసాయిరెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగిందని కోటంరెడ్డి తెలిపారు. ఈ క్రమంలోనే స్టేజీ పక్కన ఉన్న రెస్ట్‌రూమ్‌లోకి విజయసాయిరెడ్డిని తీసుకెళ్లిన సజ్జల, ఆయన చొక్కా పట్టుకుని కొట్టారని కోటంరెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. అయితే, విజయసాయిరెడ్డి ఎందుకో తిరిగి దాడి చేయలేదని ఆయన పేర్కొన్నారు. ఈ ఘటనతో విజయసాయిరెడ్డి ఆరోపణలకు బలం చేకూరినట్లయింది. విలేకరుల సమావేశంలో మాట్లాడిన కోటంరెడ్డి, విజయసాయిరెడ్డి పేర్కొన్నట్లుగానే ఈ దాడి జరిగిందని స్పష్టం చేశారు. వైసీపీలో తనకు 72 అవమానాలు జరిగాయని విజయసాయిరెడ్డి చెబుతున్నారని, తనకు తెలిసి మరో అవమానం కూడా జరిగిందని కోటంరెడ్డి గుర్తుచేశారు. విజయసాయిరెడ్డి ఒకసారి తాళ్లపూడికి వచ్చినప్పుడు, కాకుపల్లి సెంటర్‌లో ఆయనకు వాహనాలతో ఘనస్వాగతం పలికారని, ఈ విషయం తెలుసుకున్న సజ్జల ఆయన్ను ఫోన్‌లో తీవ్ర పదజాలంతో దూషించారని కూడా కోటంరెడ్డి వివరించారు. ఈ పరిణామాలు పార్టీలో విజయసాయిరెడ్డి ప్రాధాన్యాన్ని తగ్గించేందుకు సజ్జల వర్గం ప్రయత్నించిందన్న వాదనలకు బలం చేకూరుస్తున్నాయి. 2019లో వైసీపీ తరఫున నెల్లూరు రూరల్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, పార్టీ నాయకత్వంతో విభేదించి 2023లో వైసీపీని వీడారు. అనంతరం టీడీపీలో చేరి, 2024 ఎన్నికల్లో అదే నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. వైసీపీలో అంతర్గతంగా జరిగిన విషయాలు తెలిసిన వ్యక్తిగా ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు ఏపీ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. విజయసాయిరెడ్డి లేఖతో మొదలైన ఈ వివాదం, కోటంరెడ్డి ధ్రువీకరణతో మరింత ముదిరి, వైసీపీ నాయకత్వాన్ని ఇరుకున పెట్టేలా మారింది.

**తిరుపతి ఎయిర్‌పోర్ట్‌లో**

# మారిన విమాన సర్వీసుల వేళలు

మారిన సమయాలను ఒకసారి సరిచూసుకోవాలని ఈ సందర్భంగా సూచించారు. ప్రముఖ విమానయాన సంస్థ ఇండిగోకు చెందిన పలు సర్వీసుల సమయాల్లో మార్పులు జరిగాయి. నూతన షెడ్యూల్ ప్రకారం హైదరాబాద్ నుంచి తిరుపతికి నాలుగు సర్వీసులు నడుస్తున్నాయి. ఇవి ఉదయం 7:20, 11:15, మధ్యాహ్నం 1:50, రాత్రి 8:20 గంటలకు తిరుపతికి చేరుకుంటాయి. తిరిగి తిరుపతి నుంచి ఉదయం 8:00, 11:45, మధ్యాహ్నం 2:30, రాత్రి 9:00 గంటలకు హైదరాబాద్‌కు బయలుదేరుతాయి. విశాఖపట్నం నుంచి మధ్యాహ్నం 3:30 గంటలకు చేరుకుని సాయంత్రం 4:00 గంటలకు, ఢిల్లీ నుంచి సాయంత్రం 6:25 గంటలకు చేరుకుని రాత్రి 7:05 గంటలకు తిరిగి వెళ్లే సర్వీసుల సమయాలను కూడా సవరించారు. ఇతర సర్వీసుల విషయానికొస్తే.. స్టార్ ఎయిర్ విమానం శివమొగ్గ నుంచి మధ్యాహ్నం 12:20 గంటలకు తిరుపతికి చేరుకుంటుంది. ఈ విమానం తిరిగి సాయంత్రం 6:00 గంటలకు హైదరాబాద్‌కు బయలుదేరుతుంది. అదేవిధంగా, ఎయిర్ ఇండియా విమానం హైదరాబాద్ నుంచి సాయంత్రం 5:10 గంటలకు తిరుపతికి చేరుకుని, సాయంత్రం 6:00 గంటలకు తిరిగి హైదరాబాద్‌కు పయనమవుతుంది. ప్రయాణికులు మారిన సమయాలను గమనించి, ప్రయాణానికి ముందు సంబంధిత విమానయాన సంస్థల ద్వారా వివరాలను నిర్ధారించుకోవాలని అధికారులు కోరారు.

**1,000 దాటిన మరణాలు..**

# 700 మృతదేహాలు సామూహిక ఖననం

21 ఆసుపత్రులకు తరలిస్తున్నారు. గల్లంతైన వారి ఫొటోలు పట్టుకొని బాధిత కుటుంబాలు వైద్య కేంద్రాల వద్ద వేచిచూస్తున్నాయి. మృతదేహాల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో వాటిని భద్రపరిచేందుకు ఏర్పాట్లు లేక ఇబ్బందికర పరిస్థితి నెలకొంది. అయితే, అవి గుర్తించలేని స్థితిలో ఉండటం, ఒక్కోచోట కొన్ని శరీర భాగాలు మాత్రమే లభ్యం అవుతుండడంతో అవి ఎవరివనేది నిర్ధరించడం సవాలుగా మారుతోంది. ఇప్పటివరకు వెలికితీసిన మృతదేహాల్లో 60 మాత్రమే సంబంధిత కుటుంబాలకు అందజేయగా.. దాదాపు 700 మృతదేహాల నమూనాలను భద్రపరచిన అనంతరం వాటిని సామూహికంగా ఖననం చేశారు.

**రెస్క్యూలో వేలాది మంది..**

ప్రస్తుతం నేపాల్‌లోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండగా నదుల్లో నీటి మట్టం పెరుగుతోంది. మరిన్ని వరదలు సంభవించవచ్చనే హెచ్చరికలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభావిత ప్రాంతాల్లో దాదాపు 21వేల మంది భద్రతా సిబ్బంది రెస్క్యూ ఆపరేషన్‌లో నిమగ్నమయ్యారు. హెలికాప్టర్ల సాయంతో బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించడం.. రోడ్లు, వంతెనలు కూలిపోయిన ప్రాంతాల్లోని ప్రజలకు ఆహారం సరఫరా తదితర కార్యక్రమాలు చేపట్టారు.

# ఎడిటర్ వాయిస్

## ఏకగ్రీవానికి నో అగ్రీ.. జగన్ బిగ్ సౌండ్

ఏకగ్రీవం వద్దు అని మరోసారి స్పష్టం చేశారు వైసీపీ చీఫ్ వైఎస్ జగన్. అది కూడా తన సొంత జిల్లా సొంత ప్రాంతం పులివెందుల వేదికగా ఆయన బిగ్గర స్వరం వినిపించారు. ఏకగ్రీవాలు అన్న మాటే వద్దు అని వైసీపీ లీడర్ ని క్యాడర్ ని ఆదేశించారు. ప్రతీ చోటా వైసీపీ పోటీ చేసి తీరాల్సిందే అని కూడా జగన్ గట్టిగానే దిశా నిర్దేశం చేశారు. దాంతో ఏపీలో ఏకగ్రీవాల విషయంలో బిగ్ వార్ కూటమి వర్సెస్ వైసీపీగా సాగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఒకే రోజున అటు ప్రభుత్వ అధినేత చంద్రబాబు ఏకగ్రీవాలు అన్నవి అవసరమని ఆహ్వానించారు. పశ్చిమ గోదావరి జిల్లా మొగల్తూరు సభలో బాబు ఏకగ్రీవాల మీద కీలక వ్యాఖ్యలు చేశారు. దానికి ధీటుగా పులివెందుల నుంచి జగన్ పోటీ ఉండాల్సిందే అంటున్నారు.

**చాలెంజ్ గా తీసుకోవాల్సిందే :**

త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలను వైసీపీ నేతలు అంతా ఒక చాలెంజ్ గా తీసుకోవాలని జగన్ కోరారు. ఆయన పులివెందులలో పార్టీ నేతల సమావేశంలో ఈ వ్యాఖ్యలు చేశారు. అసలు ఎక్కడా ఏకగ్రీవం అన్నదే వద్దు, దానికి అసలు చాన్స్ ఇవ్వవద్దు అని చెప్పారు. ప్రతీ చోటా ప్రతీ సీటుకూ వైసీపీ పోటీ పడి తీరాల్సిందే అని కూడా జగన్ అన్నారు. ఇక అధికార పార్టీ నుంచి బెదిరింపులు వచ్చినా లేదా పోలీసులను ప్రయోగించినా దౌర్జన్యాలకు పాల్పడినా కూడా వైసీపీ శ్రేణులు ధైర్యంగా ఎదుర్కోవాలని జగన్ కోరారు. భయపడకండి అన్ని విధాలుగా పార్టీ అండగా ఉంటుంది అని జగన్ భరోసా ఇచ్చారు. అంతే కాదు వైసీపీ హయాంలో జరిగిన మేలుని, ప్రయోజనాలను ప్రజలకు వివరించాలని ఆయన కోరారు.

**ఏం జరగనుంది :**

ఏకగ్రీవాలు మేలు అని గ్రామ స్థాయిలో కక్షలు కార్పణ్యాలకు తావు లేకుండా ఉంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అంటున్నారు. ప్రభుత్వాలే వాటిని ప్రోత్సహిస్తూ వస్తున్నాయని కూడా ఆయన వివరంగా చెబుతున్నారు. ఇదిలా ఉంటే ఏకగ్రీవాలు అన్నవి గతంలో జరిగినవే అన్న సంగతిని కూటమి నేతలు గుర్తుకు తెస్తున్నారు. ఇక అధికారంలో ఏ పార్టీ ఉంటే వీలుగా ఏకగ్రీవాలు చేసుకోవడం ఎప్పటి నుంచో జరుగుతూ వస్తోంది. అలాంటిది అసలు ఏకగ్రీవం అన్న మాటే వినిపించకూడదని జగన్ ఒకటికి పదిసార్లు చెబుతున్నారు. అంటే పోటీకి వైసీపీ సై అంటోంది. అలాంటి పరిస్థితి ఉంటే కనుక అది గ్రామ స్థాయిలో కానీ పల్లెలలో కానీ ఒక రాజకీయ సమరానికే దారి తీస్తుందని అంటున్నారు. ఢీ అంటే ఢీ అంటూ రాజకీయం సాగి ప్రశాంత వాతావరణం వేడెక్కిపోతుంది అని అంటున్నారు.

**భీకర పోరుకు నాంది :**

నిజంగా పోటీకి మరో పక్షం సిద్ధంగా ఉంటే అది ప్రజాస్వామిక విధానంగా చూడాలి. అలా కాకుండా పోటీని అనివార్యం చేయడం తగదన్న మాట వినిపిస్తోంది. అలాగే పోటీకి సిద్ధంగా ఎవరైనా ఉంటే ఏకగ్రీవం పేరుతో వారి గొంతు నొక్కే తీరు మంచిది కాదని అంటున్నారు. ఏది ఏమైనా ఏపీ అంతటా ఒకేలా రాజకీయం ఉండదు, స్థానికంగా ఉండే పరిస్థితుల బట్టి అది మారుతూ ఉంటుంది. అందువల్ల ఏకగ్రీవాలు వద్దు అని వైసీపీ బిగ్ సౌండ్ చేసినా అలాగే కావాలని కూటమి కోరినా అది స్థానిక పరిస్థితులను విశేషంగా ప్రభావితం చేస్తుందని అంటున్నారు. ఎక్కడికక్కడ లోకల్ గా ఎవరికి వారు నిర్ణయించుకోవాల్సిన ఎన్నికలను ప్రతిష్టగా మార్చాలనుకుంటే భీకర పోరుకు నాంది పలికినట్లు అవుతుందని అంటున్నారు.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్

# క్రైమ్ వాయిస్

## పోలీసులపై కత్తితో దాడి చేసిన నిందితుడిపై కాల్పులు



**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** పోలీసులపై కత్తితో దాడి చేసిన నిందితుడిపై పోలీసులు కాల్పులు జరిపారు. కృష్ణా జిల్లా కంకిపాడు మండలం కోమటికుంటలాకుల డొంకరోడ్డులో ఈ ఘటన చోటు చేసుకుంది. నిందితుడు అవినాద్ కాళ్లపై కంకిపాడు సీఐ.. కాల్పులు జరిపినట్టు సమాచారం. నిన్న ఉదయం తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల సమీపంలోని దేవరపల్లి ప్రాంతంలో కత్తితో కానిస్టేబుల్‌ను గాయపరిచిన నిందితుడి కోసం పోలీసులు గాలింపు చేపట్టారు. రాత్రి 11 గంటల సమయంలో కోమటికుంటలాకుల డొంకరోడ్డులో నిందితుడు అవినాద్ ఉన్నట్టు తెలుసుకున్న కంకిపాడు, గన్నవరం సీఐలు, సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకున్నారు. ఈక్రమంలో నిందితుడు పోలీసులపై కత్తితో దాడి చేసి, రాళ్లు రువ్వాడు. వెంటనే అప్రమత్తమైన కంకిపాడు సీఐ.. నిందితుడు అవినాద్ కాళ్లపై కాల్పులు జరిపారు. నిందితుడి దాడిలో కానిస్టేబుల్ శ్రీనివాస్ ఛాతిపై గాయాలయ్యాయి. కాల్పుల్లో గాయపడిన నిందితుడిని విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

నయా మోసం.. ఏటీఎంల వద్ద నగదు తీసుకునే వారే టార్గెట్

**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఏటీఎంల వద్ద నకిలీ ఫోన్ పే, గూగుల్ పేతో నయా మోసానికి పాల్పడుతున్న ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. అంబర్‌పేట ఎస్‌బీఐ మేనేజర్ ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏటీఎంల వద్ద నగదు తీసుకునే వారినే ఈ ముఠా టార్గెట్ చేసేది. ఫోన్‌పేలో డబ్బులు పంపిస్తాం.. నగదు ఇవ్వండంటూ నిందితులు నమ్మబలికేవారు. నగదు తీసుకున్న తర్వాత ఫేక్ పేమెంట్ స్క్రీన్ చూపించి మోసం చేసినట్లు పోలీసులు గుర్తించారు. డబ్బు ఖాతాలో జమకాకముందే బాధితుల నుంచి నగదు తీసుకుని నిందితులు పరారయ్యేవారు. ఆగస్టు 19, 22, 24, 28 తేదీల్లో ఇదే తరహా ఫిర్యాదులు పోలీసులకు అందాయి. శివం రోడ్డు ఎస్‌బీఐ ఏటీఎం వద్ద మూడుసార్లు మోసాలకు పాల్పడినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఓ ఘటనలో బాధితుడి నుంచి రూ.5వేలు తీసుకుని నిందితులు పరారయ్యారు. అరెస్టయిన వారిలో విద్యార్థి (19), కారు డ్రైవర్ (23), డెలివరీ వర్కర్ (23) ఉన్నట్లు గుర్తించారు. నిందితుల నుంచి 2 ద్విచక్ర వాహనాలు, 4 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

## తప్పుడు కేసు పెట్టారని.. జైలు నుంచి వచ్చిన యువకుడి ఆత్మహత్య

**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** నగరంలోని చంపాపేట పరిధి సింగరేణి కాలనీలో యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. మేఘావత్ మహేశ్ ఇంట్లోనే ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. యువతి ఆత్మహత్యకు కారణమనే కేసులో మహేశ్ గతంలో జైలుకెళ్లి ఇటీవలే విడుదలయ్యాడు. ఈ క్రమంలో మంగళవారం ఆత్మహత్య చేసుకున్నాడు. తనపై తప్పుడు కేసు పెట్టి జైలుకు పంపారని సూసైడ్ నోట్‌లో మహేశ్ పేర్కొన్నాడు. తప్పుడు కేసులు పెట్టిన వారిని వదలొద్దని విజ్ఞప్తి చేశాడు. యువకుడి ఆత్మహత్యతో సింగరేణి కాలనీలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. దీంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు.

హత్యాయత్నం కేసులో


## బెంగళూరు వైద్యుడి అరెస్ట్



**మైదుకూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థల వివాదం నేపథ్యంలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం వైఎస్సార్ కడప జిల్లా మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ వ్యాపార సంస్థలో పనిచేస్తున్న చాగన బోయిన మురళీమోహన్‌పై జులై 22న మైదుకూరు మండలం ఉప్పుగుంటపల్లెలో హత్యాయత్నం జరిగింది. ఈ కేసుకు సంబంధించి బెంగళూరులో కార్డియాలజిస్ట్‌గా పనిచేస్తున్న డా.రవిప్రకాశ్(ఏ-5)ను మైదుకూరు పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో సోమవారం హాజరుపరిచారు. న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించటంతో ఆయన్ను కడప సెంట్రల్ జైలుకు తరలించారు. రవిప్రకాశ్‌కు బెంగళూరులోని రాజరాజేశ్వరినగరలో అత్యంత విలువైన 14 ఎకరాల భూమి ఉంది. దీనిలో కొంతభాగానికి సంబంధించి రవిప్రకాశ్‌కు, ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ కుమారుడు పుట్టా రవికుమార్ మధ్య న్యాయస్థానంలో వివాదం నడుస్తోంది. సదరు స్థలం వద్ద కాపాలాగా ఉన్న మురళీమోహన్‌పై కె.ఎన్.కుశాల్‌కుమార్(బెంగళూరు), వెంకట శివప్రసాద్(కడప), వరప్రసాద్, బాలరాజు(కమలాపురం) కత్తులతో దాడికి పాల్పడ్డారనే ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు. రవిప్రకాశ్‌ను బెంగళూరులో ఆదివారం అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరిచామని, మిగిలిన నిందితులను అరెస్ట్ చేయాల్సి ఉందని సీఐ కె.రమణారెడ్డి తెలిపారు.

## హ్యాష్ ఆయిల్ సరఫరా చేస్తున్న ఏపీకి చెందిన ఇద్దరి అరెస్టు

**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** హ్యాష్ ఆయిల్ సరఫరా చేస్తున్న ముఠాపై హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేసి ఇద్దరు అంతర్రాష్ట్ర నిందితులను అరెస్ట్ చేశారు. వారి నుంచి 1.710 లీటర్ల హ్యాష్ ఆయిల్ స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ.21.37 లక్షలు ఉంటుందని అంచనా వేశారు. నిందితులను ఏపీలోని అరకు ప్రాంతానికి చెందిన పొద్దు మోహన్ రావు, టి.బిస్తుదాస్‌లుగా గుర్తించారు. ఒడిశా నుంచి వీరు హ్యాష్ ఆయిల్ కొనుగోలు చేసి హైదరాబాద్‌లో విక్రయించేందుకు తరలిస్తుండగా పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఇందుకోసం వీరు ఆగస్టు 30న హ్యాష్ ఆయిల్ కొనుగోలు చేసి తర్వాత రోజు తెల్లవారుజామున విశాఖపట్నం నుంచి సికింద్రాబాద్‌కు రైలులో ప్రయాణించారు. సికింద్రాబాద్ చేరుకున్న తర్వాత ఆటోలో ఎస్‌ఆర్‌నగర్ వాటర్ ట్యాంక్ లైన్‌కు చేరుకుని కొనుగోలుదారుడి కోసం వేచి ఉన్నారు. ఈ క్రమంలో పక్కా సమాచారంతో పోలీసులు దాడి చేసి నిందితులను అదుపులోకి తీసకున్నారు. ఆర్థిక ఇబ్బందులతో త్వరగా డబ్బు సంపాదించేందుకు గంజాయి దందాలోకి వచ్చినట్లు నిందితులు అంగీకరించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



# విశ్వం వాయిస్

అవినీతిపై - అక్షర సమరం...

VISWAMVOICE TELUGU DAILY

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎడిషన్లు




బుధవారం, 02 సెప్టెంబర్, 2026

4

www.viswamvoice.com

సత్యం • సమగ్రం • సమాజ బద్ధత

www.viswamvoice.com


# బొప్పరాజుపై భూపతి రాజు విమర్శలను ఖండిస్తున్నాం

## ఏపీ రెవెన్యూ ఎంప్లాయిస్ రాష్ట్ర వైస్ చైర్మన్, విఆర్వోల సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి : మద్దాల బాపూజీ

**రామచంద్రపురం, సెప్టెంబర్ 1, విశ్వం వాయిస్ న్యూస్ :** గత ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులకు మెరుగైన పిఆర్సి, ఐదు డి.ఏ లు , పదకొండు పెండింగ్ ఏరియర్స్ బకాయిలు విడుదల చేస్తామని హామీనిస్తూ తమ ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన కూటమి ప్రభుత్వం నేడు మాట తప్పినందున, రాష్ట్రంలోని ఎనిమిది లక్షల ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాల కోసం ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు ప్రజాస్వామ్యబద్ధంగా ఐక్య కార్యాచరణ ఉద్యమాలకు పిలుపు ఇస్తే వాటిని అపహాస్యం చేస్తూ విమర్శిస్తున్న విఆర్వోల రాష్ట్ర అధ్యక్షులు భూపతిరాజు రవీంద్ర రాజు విమర్శలను తీవ్రంగా ఖండిస్తున్నాను. ఎవరు ప్రయోజనాలు కోసం మీరు ఈ స్క్రిప్ట్ చదువుతున్నారో స్పష్టం చేయాలని భూపతి రాజుని ప్రశ్నిస్తున్నాం. రెండున్నర సంవత్సరాల కూటమి ప్రభుత్వం పాలనలో అనేక ఉద్యమాలు చేసి గత్యంతరం లేని పరిస్థితుల్లో జులై నెల నుండి ఉద్యమానికి వెళ్తున్న నేపథ్యంలో ప్రభుత్వమే గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ బృందం మరియు 15 మంది ప్రధాన ఐఏఎస్ అధికారులతో చర్చలకు ఆహ్వానించి త్వరలోనే ముఖ్యమంత్రి తో చర్చించి ఉద్యోగులకు న్యాయం చేస్తామన్న విషయం మీకు తెలియదా... ఇచ్చిన హామీను మరచి రాష్ట్ర ఆదాయంలో 98% ఉద్యోగుల జీతాలకే సరిపోతుందని గౌరవ ముఖ్యమంత్రి శ్వేతా పత్రం విడుదల చేయడం ఉద్దేశం ఏంటో...ప్రజలకు ఉద్యోగులకు మధ్య అగాధం సృష్టించడం కోసం అనే విషయం మీకు తెలీదా భూపతి రాజు గారు. బొప్పరాజు చంద్రబాబు నాయుడు మనిషని, అందుకే రివర్స్ పియార్సి అంటూ ఉద్యమాలకు తెరతీసాడని 2023 సంవత్సరంలో జగన్ ప్రభుత్వ హయాములో సజ్జల రామకృష్ణారెడ్డి తదితరులకు వినతి పత్రం ఇచ్చిన మీరు ఈరోజు కుటమి ప్రభుత్వంలో బొప్ప రాజు ని జగన్ మనషి గా చిత్రీకరించడం మీ రెండు నాలుకల దోరనికి నిదర్శనం కాదా అని అడుగుతున్నాను. మీరు బాధ్యత గల ప్రభుత్వ ఉద్యోగులా... లేకుంటే వివిధ పార్టీల తెరవెనుక ముసుగులో ఏ ప్రయోజనం కోసం బొప్పరాజు పై విమర్శ చేస్తున్నారో స్పష్టం చేయాలని కోరుతున్నాం. ఎనిమిది లక్షల ఉద్యోగులకు పిఆర్సి అమలు అయితే విఆర్వో సోదరులకే కాదు, మీకు కూడా కూడా వర్తిస్తుంది అనే విషయం మరిచారా...గత జగన్ ప్రభుత్వంలో 92 రోజులపాటు సుదీర్ఘ పోరాటాన్ని బొప్పరాజు నడిపిన విషయం మీకు గుర్తు లేదంటే మీరు ఉద్యోగుల సంఘం నేత ఎలా అవుతారు. జగన్ ప్రభుత్వం లోనే సచివాలయాల ఉద్యోగుల చైర్మన్ వెంకటరామిరెడ్డి గారితో అనేక జీవోలు సాధించుకున్నామని, ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఏ ఒక్క సమస్య పరిష్కరించడం లేదని, చంద్రబాబు అంటేనే ఉద్యోగులకు నష్టం చేసే వ్యక్తి అని( లేదమ్మా ఈ ప్రభుత్వం వేస్ట్ అమ్మా... గత జగన్ ప్రభుత్వమే నయమమ్మా అంటూ ) వీఆర్వో ల రాష్ట్ర సమావేశాలలోనూ, వివిధ జిల్లా నాయకులు, వీఆర్వో లు ఫోన్ చేస్తున్న సందర్భాలలో మీరు వ్యాఖ్యానించిన, వాక్యానిస్తున్న విషయాలు మర్చిపోయారా భూపతి రాజు గారు. బొప్పరాజుపై మీరు చేస్తున్న వ్యాఖ్యలు ఎవరు మెప్పుకోసం చేస్తున్నారో స్పష్టం చేయమని కోరుతున్నాం. అనేక సందర్భాలలో ప్రస్తుత రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ వద్ద మీరు పదేపదే పై వాక్యాలు చెయడం పట్ల రెవెన్యూ మంత్రి గారు చాలా ఇబ్బందులకు గురవడం మీకు తెలియదా... మన ప్రభుత్వంలో ఏమీ చేయించుకోలేకపోయామని గత జగన్ ప్రభుత్వంలోనే అనేక జీవోలు వచ్చాయని, కనీసం విఆర్ఓ సంఘంతో మీరు చర్చించట్లేదని మీ స్థాయిని మరచి రెవెన్యూ మంత్రి తో అనడం ప్రారంభించినప్పటి నుంచే కదా... రెవెన్యూ



మంత్రిగారు మీ ఫోన్ రిసీవ్ చేసుకోకుండా, మీ మెసేజ్లకు జవాబు ఇవ్వకుండా, మీరు వినతి పత్రాలు ఇస్తున్నప్పుడు వారి మొహంలో చిరునవ్వు కూడా లేని పరిస్థితి మీ అసంధర్భవాక్యాలే కారణం కాదా భూపతిరాజు గారు. గౌరవ సీసీఎల్ఏ,రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ తదితరులను పత్రికల్లో విమర్శిస్తూ వీఆర్వో ల సమస్యల పరిష్కారం కాకుండా ఉండడానికి పీఠముడు వేస్తున్నది మీ అనోలిచిత పత్రిక ప్రకటనల వలన రాష్ట్ర ఉన్నతాధికారులను వీఆర్వో ల సంఘానికి దూరం చేసుకుంటున్నది మీరు కాదా భూపతి రాజు గారు. అంతే కాదు మీరు అధికార పార్టీ ఎమ్మెల్యే,ఎమ్మెల్సీ మంత్రి తదితర హోదాల్లో ఉంటున్న వ్యక్తిగా ఉహించుకుంటూ ( విమానాశ్రయాలు రాకతో విదేశీ పెట్టుబడులు పెరిగి, ఉపాధి అవకాశాలు పెరిగి, నిరుద్యోగ సమస్య పరిష్కారం అవుతుంది అంటూ ఒకసారి,స్వతంత్ర సమరయోధులు, సంఘసంస్కర్తలను స్మరించే సందర్భాన్ని దాటి , టాటాలు బిర్లాలకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియచేసే స్థాయికి మీరు వెళ్లడం చూస్తుంటే... మీకు మతిభ్రమించింది ఏమో అని భావం కలుగుతుంది. మీ చర్యలు కారణంగా రాష్ట్ర ఉన్నత అధికారులు, ప్రభుత్వ పెద్దలు, ఇతర ఉద్యోగ సంఘాల సహకారం లేకపోవడం వలన 15 వేల మంది విఆర్వోలు సమస్యలు పరిష్కారం కాకపోవడం వాస్తవం కాదా అని ప్రశ్నిస్తున్నాను. మన సంఘం పేరేమిటో తెలియదు, గ్రామ పరిపాలన అధికారుల వ్యవస్థ రెండు దశాబ్దాలు క్రితమే రద్దయిన వ్యస్థ నేడు విలేజ్ రెవిన్యూ ఆఫీసర్స్ ( వీఆర్వో లు ) గా పిలవబడుతున్నప్పటికీ ఇంకను గ్రామ పరిపాలన అధికారుల సంఘం అనడం మీ నాయకత్వంనకు నిదర్శనం. ప్రస్తుతం మీరు ఉన్న సంఘానికి రిజిస్ట్రేషన్ నెంబర్ లేదు, సంఘానికి సభ్యత్వం లేదు, రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ సమావేశాలు ఉండవు, రాష్ట్ర కమిటీ సమావేశంలో చర్చలు జరపరు, నూతన జిల్లాల కమిటీలు ఉండవు, సంవత్సరాలు కావస్తున్నా ఉన్న కమిటీలు పనిచేయవు, మండల, డివిజన్ కమిటీలు వేసుకుని సంవత్సరాలు కావస్తున్న కొత్త జిల్లా కమిటీలకు ప్రయత్నం చేయరు. 22 జిల్లాల మద్దతుతో నియమించబడ్డ మీరు, నేడు నాలుగు జిల్లాల నుండి రెండు జిల్లాలకు మీ పరపతి పడిపోవడం బాధాకరం. రాష్ట్ర అధ్యక్షులుగా ఎన్నికై మీరు ఎనిమిది సంవత్సరాల లో 18 జిల్లాలకు మీరు ఒక్కసారి కూడా వెళ్ళనే లేదు. జూమ్ మీటింగులలో అనేక జిల్లాలు మా జిల్లాలకు రండి మహాప్రభో అని మొత్తుకున్నా పట్టించుకోవడం లేదు. అంటే మీకు నాయకత్వం చేయడం రాదు, అధికారులతో సమస్యలు పరిష్కరించుకోవడం తెలియదు అని స్పష్టం అవుతున్నది. రాష్ట్రవ్యాప్తంగా రెవిన్యూ మంత్రిగారి సచివాలయం సాంబర్ కు వివిధ జిల్లాల నుండి వచ్చిన విఆర్వోలకు భోజనం పెట్టించమని మీకు 32,000 వేల రూపాయలు ఇచ్చిన గొప్ప మనసున్న రెవెన్యూ మంత్రి గారు మీ అసంధర్భ వ్యాఖ్యలతో వీఆర్వోలకు న్యాయం చేయలేకపోరని మీరు ఎప్పుడైనా గమనించారా భూపతి రాజు నువ్వొక్కడివే నాయకుడు కాదని, రాష్ట్రంలో చాలా సంఘాలు ఉన్నాయని, అన్ని విఆర్ఓ సంఘాలు వస్తేనే తప్ప మీ ఒక్కరితోనే చర్చలకు ఆహ్వానించలేమని మంత్రివర్యులు పదేపదే చెప్తున్న విషయం మీకు తెలియదా భూపతి రాజు.. ఇప్పటికే మీ వలన 15 వేల మంది విఆర్వోలు తీవ్రంగా నష్టపోయారు ఇకనైనా మీరు,. మీ నోటిని అదుపులో పెట్టుకుని, మీ పిచ్చి పిచ్చి పత్రిక ప్రకటనలతో అన్యాయం చేయడం మాని, ఎనిమిది లక్షల మంది ఉద్యోగులకు పి ఆర్ సి, డి ఎ, ఏరియర్స్ అమలుకై అన్ని తరగతుల ఉద్యోగులకు న్యాయం చేసేసేందుకు ముందుకు వస్తున్న బొప్పరాజు వెంకటేశ్వర్లు ని మీ స్థాయి మరసి విమర్శించడం తగదని హితవు పలుకుతున్నాను. రెవెన్యూ శాఖలో విఆర్ఓలపై సచివాలయ శాఖ పెత్తనాన్ని తగ్గించుకునేందుకు, కామన్ డి డి వో గా తాసిల్దార్లే ఉండాలని కోరుకుంటూ, పదోన్నతుల పర్సంటేజ్ ను పెంచాలని తదితర సమస్యలకు సానుకూలంగా స్పందిస్తున్న బొప్పరాజు మన వీఆర్వో ల నాయకులు అందరూ ఐక్యంగా ఉండండి వీఆర్వోలకు త్వరలో న్యాయం జరుగుతుంది అని, అన్ని వీఆర్వో సంఘాలు ఐక్యమై వీఆర్వో లకు మంచి చేయండి అని కోరుతూ బొప్ప రాజు ఉద్యమానికి ఏపీ విలేజ్ రెవెన్యూ ఆఫీసర్స్( వీఆర్వోస్ )అసోసియేషన్ సంపూర్ణ మద్దతును తెలియజేస్తున్నది. ప్రస్తుత ఏపీ జేఏసీ అమరావతి ఐక్య కార్యాచరణలలో భాగంగా జరుగుతున్న ఉద్యమాలలో రాష్ట్రంలోని విఆర్వోలు అందరూ భాగస్వాములు కావాలని బాపూజీ పిలుపునిచ్చారు. నిన్నటి అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద పి.జి.ఆర్. ఎస్. వినతుల సందర్భంగా అధిక సంఖ్యలో విఆర్వోలు పాల్గొనడం అభినందనీయమని బాపూజీ అన్నారు.

# పుష్ప వ్యర్థాలతో విలువ ఆధారిత ఉత్పత్తులు

## మహిళలకు ఉపాధి అవకాశాలు - కడియంలో 'టెంపుల్ ఎసెన్షియల్స్' శిక్షణ 3న అధికారికంగా ప్రారంభించనున్న ఎంపీ పురందేశ్వరి



**కడియం, సెప్టెంబర్ 1, విశ్వం వాయిస్ న్యూస్ :** దేవాలయాలు, నర్సరీల్లో లభించే పుష్ప వ్యర్థాలను సద్వినియోగం చేసుకుని విలువ ఆధారిత ఉత్పత్తు లను తయారు చేయడం ద్వారా మహిళలకు స్వయం ఉపాధి, వ్యవస్థాపకత అవ కాశాలను కల్పించే లక్ష్యం తో కడియం మండలంలో 'టెంపుల్ ఎసెన్షియల్స్ ఎంటర్ప్రెన్యూర్షిప్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్' నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ ఎలుగుబంటి వెంకట సత్య ప్రసాద్ తెలిపారు. మంగళవారం స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో తొలి రోజు శిక్షణా కార్యక్రమానికి ఎంపీపీ ముఖ్య అతిథిగా హజరయ్యారు.ఈనెల 1 నుంచి 5వ తేదీ వరకు కడియం మండల సమాఖ్య కార్యాలయంలో ఐదు రోజులపాటు జరిగే ఈ శిక్షణలో తూర్పుగోదావరి జిల్లాకు చెందిన 30 మంది మహిళా పొదుపు సంఘ సభ్యులు పాల్గొంటున్నట్లు ఎలుగుబంటి వెంకట సత్య ప్రసాద్ తెలిపారు.మహిళలకు కొత్త ఉపాధి మార్గాలు ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. పుష్ప వ్యర్థాలను వృథాగా పారవేయకుండా వాటిని ఉపయోగకరమైన ఉత్పత్తులుగా మార్చడం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు మహిళలకు అదనపు ఆదాయ మార్గాలను కల్పించవచ్చన్నారు.మహిళా పొదుపు సంఘ సభ్యులు శిక్షణలో నేర్చుకున్న నైపుణ్యాలను ఆచరణలో పెట్టి చిన్నతరహా పరిశ్రమలుగా అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. మహిళలను స్వయం ఉపాధి దిశగా ప్రోత్సహించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఏపిడి వై. ముత్యం నాయుడు మాట్లాడుతూ, శిక్షణ పొందుతున్న మహిళా సభ్యులతో పాటు కార్యక్రమం లక్ష్యాలు, పుష్ప వ్యర్థాల సద్వినియోగం పై అవగాహన కల్పించాలన్నారు. విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ, మార్కెటింగ్ అవకాశాలపై ఈ ఐదు రోజుల శిక్షణ కార్యక్రమం నేపథ్యంలో అవగాహన కల్పించనున్నామన్నారు. ఈ శిక్షణ కార్యక్రమానికి ఎఫ్ఎఫ్డీసీ నిర్ణయించిన మొత్తం వ్యయం 18 శాతం జీఎస్టీతో కలిపి రూ.4,36,600 కాగా, ఇందులో ఎఎల్ఈఎపి సంస్థ తన సొంత నిధుల నుంచి ఇప్పటికే రూ.2 లక్షలు చెల్లించింది. మిగిలిన రూ.2,36,600లను యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, తూర్పుగోదావరి జిల్లా, రాజమహేంద్రవరం రీజినల్ మేనేజర్ సహకారంతో సమకూర్చినట్లు తెలియ చేశారు.అసోసియేషన్ ఆఫ్ లేడీ ఎంటర్ప్రెన్యూర్స్ ఆఫ్ ఇండియా (ఎఎల్ఈఎపి) ప్రతినిధి సునీత మాట్లాడుతూ దేవాలయాలు, నర్సరీల నుంచి సేకరించే పుష్ప వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతుల్లో ప్రాసెస్ చేసి అగరబత్తీలు, ధూప్ కోన్స్, హవన సామగ్రి, సహజ పరిమళ ద్రవ్యాలు తదితర విలువ ఆధారిత ఉత్పత్తులను తయారు చేసే విధానాలపై మహిళలకు నిపుణులతో శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు.రాజమహేంద్రవరం పార్లమెంటు సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరి చొరవతో డీఆర్డీఏ-సెర్ప్, తూర్పుగోదావరి జిల్లా ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వివరించారు. కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ పరిధిలోని ఫ్రాగ్రెన్స్ అండ్ ఫ్లేవర్ డెవలప్మెంట్ సెంటర్ (ఎస్.ఎఫ్.డి.సి), కన్నౌజ్, ఎఎల్ఈఎపి సంస్థల సమన్వయంతో శిక్షణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పుష్ప వ్యర్థాలను ఆదాయ వనరుగా మలచడం ద్వారా మహిళలకు ఉపాధి అవకాశాలతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా దోహదపడుతుందని పేర్కొన్నారు.ఈ శిక్షణ కార్యక్రమం అధికారిక ప్రారంభోత్సవాన్ని సెప్టెంబరు 3న ఉదయం 10 గంటలకు కడియంలోని జీఎస్ఆర్ కన్వెన్షన్ హాలులో నిర్వహించనున్నారు.రాజమహేంద్రవరం పార్లమెంటు సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరి కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఈనెల 3న జరిగే ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, జిల్లా కలెక్టర్ శ్రీమతి కీర్తి చేకూరి, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, కడియం మండల పరిషత్ అధ్యక్షుడు ఎలుగుబంటి వెంకట సత్య ప్రసాద్, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొననున్నారు.తొలి రోజు శిక్షణా కార్యక్రమంలో ఎఎల్ఈఎపి ప్రతినిధి సునీత, ఏపీడీ సత్యం నాయుడు, డీపీఎం హేమంత్, డీఆర్డీఏ--సెర్ప్ సిబ్బంది, మహిళా పొదుపు సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.






# 2150వ రోజుకు స్వర్ణాంధ్ర అన్నదాన సేవలు

## 25600 మంది స్వచ్ఛంద సేవకులు సేవలందించారు - 12లక్షల 50 వేల మంది లబ్ధిదారులకు అన్నదాన సేవలు

## సహకరిస్తున్న దాతలకు ధన్యవాదాలు : స్వర్ణాంధ్ర రాంబాబు



**రాజమహేంద్రవరం, సెప్టెంబర్ 1, విశ్వం వాయిస్ న్యూస్ :** నిరాశ్రయులు, అవసరార్థుల కోసం స్వర్ణాంధ్ర సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ఉచిత మొబైల్ అన్నదాన సేవలో నేటికీ 2150వ రోజుకు చేరినట్లు స్వర్ణాంధ్ర నిర్వాహకులు లయన్ డాక్టర్ గుబ్బల రాంబాబు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఉదయం స్థానిక ప్రభుత్వాసుపత్రి వద్ద జరిగిన అన్నదాన వడ్డింపు సేవలో రాంబాబు స్వయంగా పాల్గొని సేవలందించారు. ఈ సందర్భంగా దాతల దగ్గర నుండి సేకరించిన దుస్తులను ప్రత్యేకంగా మిఠాయిలను అవసరార్ధులకు అందించారు. రాంబాబు మాట్లాడుతూ గత ఆరు సంవత్సరాలుగా స్వర్ణాంధ్ర మొబైల్ ఉచిత అన్నదాన సేవలకు సహకరిస్తున్న దాతలకు నగర ప్రముఖులకు అన్నదాన సేవల్లో పాల్గొంటున్న వాలంటీర్స్ కు కృతజ్ఞతలు తెలిపారు. గత ఆరు సంవత్సరాలుగా 26 వేల మంది స్వచ్ఛంద సేవకులు అన్నదాన సేవల్లో పాల్గొనగా 17వేల 800 గంటల సమయాన్ని అన్నదాన సేవలు కోసం వెచ్చించామన్నారు. ఇప్పటివరకు సుమారు 12లక్షల 50 వేల మంది లబ్ధిదారులకు అన్నదాన సేవలు అందించినట్లు రాంబాబు తెలిపారు. పుష్కర ఘాట్ తో మరియు ప్రభుత్వ ఆసుపత్రి వద్ద సుమారు 500 మందికి ఈరోజు ప్రత్యేక అన్నదానం తో పాటు దాతలు అందించిన పంచదార చిలుకల స్వీటును, అరటి పండ్లను లబ్ధిదారులకి అందించామన్నారు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో హెల్పింగ్ హాండ్స్ గ్రూప్ అడ్మిన్ అనూప్ కుమార్ జైన్, స్వర్ణాంధ్ర మేనేజర్ హరికృష్ణ, రాజేష్, రాంజీ, శ్రీనివాస్ తదితరులు అన్నదాన సేవలో పాల్గొన్నారు.







**కే.గంగవరం, సెప్టెంబర్ 1, విశ్వం వాయిస్ న్యూస్ :** నిత్యం వందలాది వాహనాలతో కిటకిటలాడే ఆ ప్రధాన రహదారిపై ప్రయాణం అంటేనే ఇప్పుడు వాహనదారులు వణికిపోతున్నారు. క్షణం ఏమరుపాటుగా ఉన్నా, లేదా వాహనం అదుపు తప్పినా నేరుగా మృత్యుఒడికి చేరాల్సిందే. ఎర్రపోతవరం నుండి యానం వెళ్లే ప్రధాన రహదారిలో అద్దంపల్లి టర్నింగ్ వద్ద నెలకొన్న భయానక పరిస్థితులు ప్రతి ఒక్కరినీ కలచివేస్తున్నాయి. ఈ మార్గంలో రోడ్డును ఆనుకుని ఏకంగా 15 అడుగుల లోతైన కాలువ ఉంది. ఇక్కడ అత్యంత ఆవశ్యకమైన కల్వర్టు గానీ, కనీసం వాహనాలు కాలువలోకి దూసుకుపోకుండా ఆపే రక్షణ గోడ గానీ లేకపోవడం పాలకుల, అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్టగా నిలుస్తోంది. మలుపు తిరిగే సమయంలో కాస్త వేగంగా ఉన్నా, ఎదురుగా వచ్చే వాహనాలకు సైడ్ ఇవ్వబోయినా నేరుగా ఆ అగాధంలోకి పడిపోవాల్సిందే. ఒకవేళ వాహనం కాలువలో పడితే ప్రాణాలతో బయటపడటం దాదాపు అసాధ్యం. ముఖ్యంగా రాత్రి వేళల్లో మరియు వర్షాకాలంలో ఈ మలుపు వద్ద కాలువ ఉన్న ఆనవాళ్లు కూడా కనిపించవు. ఎదురుగా వచ్చే భారీ వాహనాల హెడ్‌లైట్ల కాంతికి కళ్లు బైర్లు కమ్మి దారి సరిగ్గా కనబడకపోయినా, బైక్ టైరు కాస్త స్కిడ్ అయినా ప్రాణాలు గాలిలో కలవడం ఖాయం. ఉద్యోగులు, వ్యాపారులు, నిత్యం రాకపోకలు సాగించే సామాన్య ప్రజలు ఈ దారిలో ప్రతిరోజూ బిక్కుబిక్కుమంటూ ప్రయాణం సాగిస్తున్నారు. ఇదే దారిలో రామచంద్రపురం మండలం ద్రాక్షారామం - ఎర్రపోతవరం మధ్యలో ఉండే రామారావుపేట టర్నింగ్ వద్ద పరిస్థితి మరీ అధ్వాన్నంగా తయారైంది. ఈ ప్రాంతం గుండా నిత్యం భారీ వాహనాలు అధిక సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే, ఈ ప్రమాదకరమైన టర్నింగ్ వద్ద కనీసం ప్రమాద హెచ్చరిక బోర్డులు గానీ, రిఫ్లెక్టర్లు గానీ లేకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సరైన సూచికలు లేకపోవడం వల్లనే ఇక్కడ గత మూడు నెలల్లోనే వరుసగా మూడు, నాలుగు ఘోర రోడ్డు ప్రమాదాలు జరిగాయి. అమాయకులైన ప్రయాణికులు తీవ్ర గాయాలపాలవుతున్నా సంబంధిత శాఖల అధికారుల్లో మాత్రం ఎలాంటి చలనం లేదు. ఇంత జరుగుతున్నా ఆర్ అండ్ బి అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు ఇప్పటికీ నిద్రమత్తు వీడకపోవడం గర్హనీయం. ఏదైనా పెద్ద ఘోర ప్రమాదం జరిగి, పది మంది ప్రాణాలు గాలిలో కలిశాక హడావిడి చేయడానికి అధికారులు సిద్ధంగా ఉన్నారా అనే తీవ్ర ఆగ్రహం స్థానికుల నుంచి వ్యక్తమవుతోంది. ఎలాంటి ప్రాణనష్టం జరగకముందే అద్దంపల్లి మలుపు వద్ద తక్షణమే కల్వర్టు, రక్షణ గోడను నిర్మించాలి.. రామారావుపేట టర్నింగ్ వద్ద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా యంత్రాంగం కళ్లు తెరిచి తక్షణ భద్రతా చర్యలు చేపట్టకపోతే ప్రజా ఆగ్రహాన్ని ఎదుర్కోక తప్పదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



రోజు ఉదయం పూట పసిపిల్లలను బస్సులో ఎక్కించుకుని స్కూలుకు చేరవేయడం మా దైనందిన బాధ్యత. కానీ, అద్దంపల్లి, రామారావుపేట టర్నింగ్‌ల దగ్గర రోడ్ల దుస్థితి చూస్తుంటే మా గుండెల్లో దడ పుడుతోంది. అద్దంపల్లి మలుపు వద్ద పక్కనే 15 అడుగుల లోతైన కాలువ ఉంది; కనీసం రక్షణ గోడ లేకపోవడంతో క్షణం తేడా కొట్టినా బస్సు ఆ అగాధంలో పడటం ఖాయం. ఇక రామారావుపేట టర్నింగ్ దగ్గరైతే హెచ్చరిక బోర్డులు లేక ఇప్పటికే చాలా ప్రమాదాలు జరిగాయి. పసిపిల్లల ప్రాణాలతో ముడిపడి ఉన్న ఈ సమస్యపై అధికారులు ఇప్పటికైనా స్పందించి వెంటనే రక్షణ గోడలు, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి.

**బొమ్ము రాంబాబు**
ప్రైవేట్ స్కూల్ బస్సు డ్రైవర్

# రూ.6.25 కోట్లతో గ్రామీణ రహదారుల అభివృద్ధికి శ్రీకారం

### రామచంద్రపురం నియోజకవర్గంలో నాలుగు ప్రధాన రోడ్లకు శంకుస్థాపన
### కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, జనసేన ఇన్చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్

**రామచంద్రపురం/ కె గంగవరం, సెప్టెంబర్ 1, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం నియోజకవర్గంలో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి, ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆదేశాల మేరకు కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, జనసేన ఇన్చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్లు కూటమి పార్టీ నాయకులుతో కలిసి మంగళవారం పలు రహదారి అభివృద్ధి పనులను ప్రారంభించారు. మొత్తం రూ.6.25 కోట్ల వ్యయంతో చేపట్టనున్న నాలుగు ప్రధాన రోడ్డు పనులకు వాసంశెట్టి సత్యం శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. రోడ్లు అభివృద్ధి చెందితే గ్రామాల ఆర్థిక పురోగతి వేగవంతం అవుతుందని, ప్రజల రాకపోకలు సులభతరం అవుతాయని పేర్కొన్నారు. రాష్ట్ర కార్మిక శాఖ



మంత్రి వాసంశెట్టి సుభాష్ చొరవతో నియోజకవర్గానికి నిధులు కేటాయిస్తున్నారని పేర్కొన్నారు.

**మంజూరైన రోడ్లు - కేటాయించిన నిధులు**

రామచంద్రపురం మండలంలో కేవీఎఫ్ రోడ్డు నుంచి వెంకటాపాలెం - గణపతినగరం వరకు రోడ్డు అభివృద్ధి నిధులు- రూ.1.49 కోట్లుతో శంకుస్థాపన చేశారు. కె.గంగవరం మండలంలో ఆర్ & బి రోడ్డు నుంచి కొత్తకొంపలు - కుడుపూరు సావరం మీదుగా రోడ్డు అభివృద్ధి నిధులు- రూ.1.36 కోట్లు. అలాగే పేకేరు నుంచి పాలమూరుపాడు (దుగ్గుదూరు మీదుగా) రోడ్డు నిధులు: రూ.1.48 కోట్లుతో, సత్యవాడ నుంచి కూళ్ల - నీలగిరిపేట మీదుగా రోడ్డు అభివృద్ధి నిధులు- రూ.1.92 కోట్లు. ఆంధ్రప్రదేశ్ రూరల్ రోడ్స్ స్ట్రెంతనింగ్ ప్రాజెక్ట్ నిధులతో మొత్తం వ్యయం నాలుగు రహదారి పనులకు మొత్తం కేటాయించిన నిధులు రూ.6.25 కోట్లుతో శంకుస్థాపన చేశారు. మంత్రి సుభాష్ ఆదేశాలు మేరకు ప్రారంభమైన ఈ రహదారి పనులు పూర్తయిన అనంతరం రామచంద్రపురం, కె.గంగవరం మండలాల పరిధిలోని పలు గ్రామాల ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి వేగవంతం కావడంతో పాటు వ్యవసాయ ఉత్పత్తుల రవాణా, విద్యార్థులు, ఉద్యోగుల ప్రయాణాలకు ఎంతో ఉపయోగకరంగా నిలవనున్నాయని స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ డిఈ ప్రాజెక్ట్స్ ఎ రాంబాబు, ఈ ఈ సీతమ్మ నాయుడు, జె ఈ కొండలరావు, జె ఈ యేసు రత్నం, గంగవరం మండలం టీడీపీ అధ్యక్షులు మేడిశెట్టి రవికుమార్, స్వచ్ఛా ఆంధ్ర డైరెక్టర్ సలాది రమేష్, కూటమి పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### మధ్యనగర్ గ్రామంలో శ్రీ కృత్తివెంటి పేర్రాజు పంతులు పశుసంవర్ధక పాలిటెక్నిక్ విద్యార్థుల

## ఎస్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం




**రామచంద్రపురం, సెప్టెంబర్ 1, విశ్వం వాయిస్ న్యూస్ :** శ్రీ కృత్తివెంటి పేర్రాజు పంతులు పశుసంవర్ధక పాలిటెక్నిక్ కాలేజీ 2024 బ్యాచ్ విద్యార్థులు ఎస్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో భాగంగా రామచంద్రపురం మండలం మధ్యనగర్ గ్రామంలో నేడు పర్యటించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు నేరుగా రైతుల వద్దకు వెళ్లి పశువులను పరిశీలించి దూడలకు నట్టల నివారణ మందులు మరియు బాహ్యపరాన్న జీవుల నివారణ మందులను పంపిణీ చేశారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జె.జయలక్ష్మి స్వయంగా పాల్గొని పశువుల పెంపకంలో తీసుకోవాల్సిన మెలుకువలు మరియు పలు కీలక సూచనలను రైతులకు వివరించారు. స్థానిక రైతులు, కాలేజీ అధ్యాపక సిబ్బంది ఈ సేవా కార్యక్రమంలో ఉత్సాహంగా పాలుపంచుకున్నారు.


### సంక్షేమ పాలనకు ప్రతీక

## ఎన్టీఆర్ భరోసా..

**రామచంద్రపురంలో పెన్షన్లు పంపిణీ చేసిన మంత్రి సుభాష్**
**లబ్ధిదారులతో ఆప్యాయంగా మమేకమైన మంత్రి సుభాష్**
**ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వ పాలనకు మూలస్తంభం**



**రామచంద్రపురం, సెప్టెంబర్ 1, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు ప్రజల జీవితాల్లో భరోసా నింపుతున్నాయని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. రామచంద్రపురం పట్టణంలోని క్లస్టర్-2 పరిధిలోని 8, 9 వార్డుల్లో మంగళవారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో మంత్రి సుభాష్, మున్సిపల్ కమిషనర్ కె.వి.ఆర్ రాజుతో కలిసి పాల్గొని లబ్ధిదారుల ఇంటింటికీ వెళ్లి పెన్షన్లు అందజేశారు. ఈ సందర్భంగా వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, ఇతర లబ్ధిదారులను ఆప్యాయంగా పలకరించిన మంత్రి వారి ఆరోగ్య పరిస్థితులు, కుటుంబ అవసరాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉందని, ప్రతి అర్హ కుటుంబానికి ప్రభుత్వ ఫలాలు చేరేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మంత్రి సుభాష్ మాట్లాడుతూ ఒకటో తేదీనే తెల్లవారుజాము నుంచే లబ్ధిదారుల గడప వద్దకు వెళ్లి పెన్షన్లు అందించడం కూటమి ప్రభుత్వ సంక్షేమ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. ఆర్థిక పరిస్థితులు ఎంత సవాలుగా ఉన్నా ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలులో ఎలాంటి రాజీ పడకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ మార్గదర్శకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు సమర్థవంతంగా అమలవుతున్నాయని తెలిపారు. రామచంద్రపురం నియోజకవర్గంలో కూడా ప్రతి అర్హుడికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా నిరంతరం కృషి చేస్తున్నామని అన్నారు. ప్రజల ముఖాల్లో చిరునవ్వు చూడటమే కూటమి ప్రభుత్వ అసలు లక్ష్యమని, అభివృద్ధి మరియు సంక్షేమాన్ని సమపాళ్లలో అందిస్తూ రాష్ట్రాన్ని పురోగతి పథంలో నడిపిస్తున్నామని మంత్రి సుభాష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.వి.ఆర్.ఆర్.రాజు, పట్టణ టీడీపీ అధ్యక్షులు ఉండవల్లి శివ, ఉపాధ్యక్షులు చందమామ వాసు, క్లస్టర్-2 ఇన్‌చార్జి కంచుమర్తి బాబురావు, నారపురెడ్డి బలరాం, కట్టా నాగేశ్వరరావు, కవల నానాజీ,గడి గోవిందు, ఏలూరు ఏసుదాసు, 8 వార్డు ప్రెసిడెంట్ చిక్కాల వీరస్వామి, 9 వార్డు ప్రెసిడెంట్ తొగరి శ్రీను, టేకుమూడి రామకృష్ణ, నాగదేవర నాయుడు, శ్రీను, మనోజ్,కార్యకర్తలు, లబ్ధిదారులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.



# రైతుల న్యాయం కోసం పోరాడాను - నష్టపరిహారం సాధించాను

## ఎస్ఈజెడ్ ఏపీఐఐసీ భూసేకరణలో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే దివ్య



**కోటనందూరు, సెప్టెంబర్ 1, విశ్వం వాయిస్ న్యూస్ :** వాగ్దానం నెరవేరింది. ఎస్ఈజడ్ భూనిర్వాసితుల పక్షాన నిలిచిన మాజీ ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు, ప్రభుత్వ విఫ్ యనమల దివ్య కృషి ఫలించింది.పరిహారం కోసం పదేళ్ళుగా నిరీక్షించిన రైతాంగం ఆనంద తాండవంతో ప్రభుత్వ విఫ్ యనమల దివ్య చేతుల మీదుగా నష్టపరిహారం అందుకున్నారు.ఎస్ ఈజడ్ పరిధిలో ఏపీఐఐసీ తొండంగి మండలంలో ఎస్ఈజడ్ పేరుతో సేకరించిన భూముల్లో దివీస్, పోర్టులకు కేటాయింపు జరిగింది. అప్పట్లో ఎకరానికి 10 లక్షలు పరిహారం చెల్లిస్తానన్న ప్రభుత్వ నిర్ణయాన్ని రైతులు వ్యతిరేకించి నష్ట పరిహారం ముట్టుకోలేదు. మీ ఇంటికి మీ దివ్య కార్యక్రమంలో ఎమ్మెల్యే యనమల దివ్య ఈరైతాంగానికి భరోసా ఇచ్చారు. ఆశించిన రీతిలో పరిహారం వచ్చేలా చూస్తానని మాజీ ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అటు యనమల ఇటు దివ్య ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చారు. ఈ రెండేళ్ళు ఇదే అంశంపై పట్టుబట్టిన ఎమ్మెల్యే యనమల దివ్య ప్రభుత్వాన్ని ఒప్పించి ఎకరానికి 18 లక్షలు చెల్లించేందుకు అనుమతులు తెచ్చారు. ఈనేపధ్యంలో 895 ఎకరాలకు సంబంధించి 1145 మంది రైతులకు ఎకరానికి 18 లక్షలు చెల్లింపులకు అధికార యంత్రాంగం శ్రీకారం చుట్టారు. రైతులకు న్యాయం కోసం పోరాడాను నష్టపరిహారం సాధించాను తుని ఎమ్మెల్యే శ్రీమతి యనమల దివ్య ఎస్ఈజడ్ రైతాంగం సమస్య ఏదైనా వారికి న్యాయం చేసే లక్ష్యంతో పని చేస్తానని ప్రభుత్వ విఫ్ యనమల దివ్య అన్నారు.తొండంగి మండల తహాశీల్దార్ కార్యాలయంలో పెద్దాపురం ఆర్డీవో కృష్ణమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి సీనియర్ నేత యనమల రాజేష్ తో కలిసి ఎమ్మెల్యే యనమల దివ్య ముఖ్య అతిథిగా విచ్చేసారు. ఈ సందర్భంగా ఎస్ఈజడ్,ఏపీఐఐసి భూసేకరణ వల్ల భూములు కోల్పోయిన రైతాంగానికి ఎకరానికి 18లక్షలు చొప్పున నష్టపరిహారం చెక్కులను అందజేసారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూమి రైతుల ఆత్మ గౌరవానికి సంబందించిన అంశమని, వైసీపీ హయాంలో నష్టపోయిన రైతాంగానికి ఇచ్చిన మాట ప్రకారం ఎకరానికి 18లక్షలు పరిహారం అందిస్తున్నామని కూటమి ప్రభుత్వం రైతు పక్షాన నిలిచి వారికి అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో తహాశీల్దార్ కాంతారావు, పోర్టు ప్రతినిధులు మోహన్ రెడ్డి, పెరుమాళ్ళు, మండల టీడీపీ అధ్యక్షుడు చొక్కా అప్పారావు కూటమి నాయకులు పాల్గొన్నారు.

# జీజీహెచ్‌లో రోగులకు మెరుగైన సౌకర్యాలు కనిపిస్తాం : ఎంపీ ఉదయ్ శ్రీనివాస్



**కాకినాడ, సెప్టెంబర్ 1, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి (జీజీహెచ్)ను అన్ని విధాలా అభివృద్ధి చేయడంతో పాటు రోగులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం ఆయన ఆసుపత్రి వైద్యులు, సిబ్బందితో కలిసి జిజిహెచ్ లో వివిధ విభాగాలను పరిశీలించి, రోగులకు అందుతున్న వైద్య సేవలు, ఆసుపత్రిలోని మౌలిక వసతులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రి ఆవరణలోని ఖాళీ స్థలాలను వినియోగించుకుని పెద్దఎత్తున మొక్కలు నాటి పచ్చదనం పెంచాలని, ఆసుపత్రి పరిసరాలను మరింత ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని సూచించారు. అదేవిధంగా, ఆసుపత్రికి వచ్చే రోగులు, వారి సహాయకులు ఇబ్బందులు పడకుండా ఆవరణలో అవసరమైన ప్రాంతాల్లో వెయిటింగ్ హాల్స్ నిర్మించాలని సూచించారు. ఇందుకోసం తన ఎంపీ ల్యాడ్స్ నిధులతో పాటు కౌడా నుంచి కూడా అవసరమైన నిధులు కేటాయించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఆసుపత్రి లో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందుబాటు లోకి తీసుకురావా లని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కౌడా చైర్మన్ తలాటం సత్య, జనసేన నాయకులు నున్న దొరబాబు, జిజిహెచ్ అభివృద్ధి కమిటీ సభ్యులు సుంకర సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# కాకినాడలో పెన్షన్‌లు పంపిణీ చేసిన సిటీ ఎమ్మెల్యే కొండబాబు



**కాకినాడ, సెప్టెంబర్ 1, విశ్వం వాయిస్ న్యూస్ :** పండగలు ఏడాదికి ఒకసారి వస్తే పేదలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఇతర అర్హులైన పింఛన్ దారుల ఇళ్లలో మాత్రం ప్రతి నెలా పింఛన్ అందే రోజు పండగ వాతావరణం నెలకొంటోందని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు తెలిపారు.మంగళవారం స్థానిక 38 వ డివిజన్ నందు నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వనమడి కొండబాబు, ఇంచార్జ్ కమిషనర్ సత్యనారాయణతో కలిసి లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి పెన్షన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొండబాబు మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తూ అర్హులైన ప్రతి కుటుంబానికి అండగా నిలుస్తోందని పింఛన్ పంపిణీలో జాప్యం లేకుండా చర్యలు చేపడుతూ లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్లు అందించే విధానాన్ని కూటమి ప్రభుత్వం సమర్థవంతంగా నిర్వహిస్తుందని, సంక్రాంతి, క్రిస్మస్, రంజాన్ వంటి పండగలు సంవత్సరానికి ఒకసారి వస్తాయని, కూటమి ప్రభుత్వంలో పేద కుటుంబాలకు ప్రతి నెలా పింఛన్ అందే రోజు ఒక పండగలా మారిందని, ఉదయం నుంచే లబ్ధిదారుల ఇళ్ల వద్దకు చేరుకుని పింఛన్లు అందించడం వల్ల వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, అనారోగ్యంతో ఉన్న వారు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా తమ ఇంటి వద్దనే పింఛన్ పొందుతున్నారని, కుటుంబంలో సంపాదించే వారు లేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్న వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు నెల వారీగా అందుతున్న పింఛన్ ఎంతో ఆర్థిక భరోసాను కల్పిస్తోందని, కుటుంబ పోషణ, మందులు, ఇతర వ్యక్తిగత అవసరాలకు పింఛన్ మొత్తం ఉపయోగపడుతోందన్నారు. ప్రభుత్వం సంక్షేమ పథకాలను కొనసాగించడం ద్వారా అర్హులైన వర్గాలకు అండగా నిలుస్తోందని, పింఛన్ తేదీ ఆదివారం వచ్చినా లబ్ధిదారులు ఇబ్బంది పడకుండా ముందుగానే పింఛన్ అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, కొత్త పింఛన్ల కోసం అందిన దరఖాస్తులను ప్రభుత్వం పరిశీలనలోకి తీసుకుందని, అర్హత ఉన్న వారికి త్వరలోనే పింఛన్లు మంజూరు చేయడం జరుగుతుందని, కూటమి ప్రభుత్వం సంక్షేమానికి పెద్ద పీట వేస్తూ పాలన సాగించడం జరుగుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, డివిజన్ నాయకులు ఏ వి డి మెంటారావు, నానావరుపు సుబ్రహ్మణ్యం, పలివెల లక్ష్మి, అనకాపల్లి గణేష్, ఆకుల శ్రీనివాస్, దీప్తి, మజ్జి రాంబాబు, చీకట్ల సత్తిబాబు, కోట నాగలక్ష్మి, సీరం అప్పారావు, తామరపల్లి నాగేశ్వరరావు, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

అపర భగీరధుడికి అపూర్వ రీతిలో

# ఘన స్వాగతం పలుకుతాం

### సీనియర్ నేతలు యనమల రాజేష్ చింతమనీడి అబ్బాయి




**కోటనందూరు, సెప్టెంబర్ 1, విశ్వం వాయిస్ న్యూస్ :** గోదావరి జలాలు ఉత్తరాంధ్రకు తరలిస్తున్న అపరభగీరధుడికి అపూర్వ రీతిలో ఘన స్వాగతం పలుకుతామని తుని నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ సీనియర్ నేతలు చెప్పారు. మాజీ ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు, ప్రభుత్వ విఫ్ యనమల దివ్య ఆదేశాలతో ఈ నెల 2వ తేదీన ఉత్తరాంధ్ర ముఖ ద్వారం పాయకరావుపేట వస్తున్న అపర భగీరధుడు సీఎం చంద్రబాబు నాయుడు కు 6వేల మందితో ఘన స్వాగతం పలుకుతామని సీనియర్ నేతలు యనమల రాజేష్, చింతంనీడి అబ్బాయి,యినుగంటి సత్యనారాయణ చెప్పారు. సీఎం సభకు వచ్చే రైతుల కోసం చేస్తున్న ఏర్పాట్లపై టౌన్ సీఐ గీతా రామకృష్ణ తో చర్చించారు. హాయ్ రెస్టారెంట్ వద్ద ఒక ఫుడ్ కౌంటర్, కుమ్మరిలోవ తపోవనం సమీపంలో మరో ఫుడ్ సెంటర్ ఏర్పాటు చేసామని ఈరెండు ప్రాంతాల నుంచి వంద బస్సుల్లో జలహారతికి వెళ్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కుసుమంచి సత్యనారాయణ,మల్ల గణేష్,దూలం మురళి, అంకంరెడ్డి బుల్లిబాబు, కొత్తూరి బుజ్జి, దాసరి ఈశ్వరరావు, వంగలపూడి వాసు చింతకాయల ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్మీదేవి పేటలో పొలం పిలుస్తుంది కార్యక్రమం




**కోటనందూరు, సెప్టెంబర్ 1, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా కోటనందూరు మండలంలో లక్ష్మీదేవిపేట గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఏఈఓ జగ్గ అప్పారావు మాట్లాడుతూ వరి వేసుకొనే రైతులు అందరూ ఈ సంవత్సరం ఎలినినో ప్రభావము వలన వర్షపాతం తక్కువగా ఉండి ఎండలు ఎక్కువగా ఉన్నందువలన రైతులందరూ ప్రధానమంత్రి పసల్ బీమా యోజన క్రింద ఎకరానికి 760 రూపాయలు బీమా చేయించుకోవాలి అని చెప్పారు. క్రాప్ లోన్ తీసుకొనే రైతులు తప్పకుండా బ్యాంకు ద్వారా బీమా చేసుకోవాలని అలాగే లోన్ తీసుకోని రైతులు మీ సేవా ద్వారా భీమా కట్టుకోవాలి అని చెప్పారు.అలాగే కౌలు చేసే ప్రతి రైతు (సి సి ఆర్ సి ) కౌలు కార్డులు తప్పకుండా చేసుకోవాలి అని సూచించారు. యూరియా పంటకు కావలసినంత మాత్రమే వాడుకోవాలని తెలిపారు. ఎరువులు మట్టి పరీక్ష ఆధారంగా వాడాలని తెలియపరిచారు. మెరక భూములు ఉన్న రైతులందరూ అపరాల పంటలు వేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాజేష్,మోహన్, రైతులు పాల్గొన్నారు.

# కాకరాపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి అదృశ్యం



**కోటనందూరు, సెప్టెంబర్ 1, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా, కోటనందూరు మండలం, కాకరాపల్లి గ్రామానికి చెందిన లంక మరిణియ్య అలియాస్ బాబ్జి గత నెల 31వ తేదీన అదృశ్యమైనట్లు ఎస్సై టి.రామకృష్ణ తెలియజేశారు. అదృశ్యమైన వ్యక్తి బంధువు లంక ప్రసాద్ ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఎస్సై రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం కాకరాపల్లి గ్రామానికి చెందిన లంక బాబ్జి గత నెల 31వ తేదీన ఉదయం 11 గంటల సమయంలో తాను అద్దెకు ఉంటున్న ఇంటి నుండి బయటకు వెళ్లి తిరిగి రాలేదని బంధువులు ఆందోళన చెందుతున్నట్లు తెలియజేశారు. అదృశ్యమైన లంక బాబ్జి వయసు 58 సంవత్సరంలు ఉంటాయని ఎత్తు 5 అడుగుల 5 అంగుళాలు ఎరుపు తెలుపు రంగులో ఉండి సన్నగా ఉంటారని తెలియజేశారు. అదృశ్యమైన సమయంలో సిమెంట్ కలర్ ట్రాక్ ప్యాంటు బిస్కెట్ కలర్ షర్ట్ ధరించారని ఆచూకీ తెలిపిన వారు కోటనందూరు పోలీస్ స్టేషన్‌కు 9440900773 నెంబర్ కు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ తెలియజేశారు.

రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమమే

# కూటమి ప్రభుత్వ ధ్యేయం

### ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ



**రౌతులపూడి, సెప్టెంబర్ 1, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ పేర్కొన్నారు. మంగళవారం ఆమె రౌతులపూడి మండలం లో పర్యటించారు. ముందుగా రౌతులపూడి మండల పరిషత్ కార్యాలయంలో నూతనముగా అభివృద్ధి పరిచిన సమావేశహాల్ ను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం జల్దాం పంచాయతీ శివారు చాకిరేవుపాలెం లో నిర్మించిన సిమెంట్ రోడ్డును ప్రారంభించారు. అదే గ్రామంలో కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పింఛన్ లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేశారు. లిన్సి ఫౌండేషన్ ద్వారా పలు ఉపకరణాలను అందజేశారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారన్నారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి అన్ని విధాల ఎంతో కృషి చేస్తున్నానని ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు. ఈకార్యక్రమం లో ఎంపీపీ గంటిమల్ల రాజలక్ష్మి, రాష్ట్ర కొప్పుల కార్పొరేషన్ డైరెక్టర్ పైల సాంబశివరావు, కత్తిపూడి సత్రం చైర్మన్ సోమ రౌతు చంద్రమౌళి,తుని జోన్ ఆత్మ కమిటీ వైస్ చైర్మన్ కరణం సుబ్రహ్మణ్యం, జడ్పిటిసి గొల్లు చిన్న దివాణం, ఎంపీడీవో జి.శివరామకృష్ణయ్య, తాసిల్దార్ కృష్ణకుమారి కూటమి నాయకులు పాల్గొన్నారు.

# ఒంటిమామిడిలో పెన్షన్ల పంపిణీ ప్రజా దర్బార్

### ప్రజా సమస్యలకు జవాబుదిరితనంతో కూడిన పరిష్కారం చూపించాలి
### యనమల దివ్య ఎమ్మెల్యే తుని





**కోటనందూరు, సెప్టెంబర్ 1, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజా సమస్యలకు జవాబుదారీతనం కూడిన పరిష్కారం చూపించాలని తొండంగి మండలం అధికార యంత్రాంగాన్ని ప్రభుత్వ విఫ్ యనమల దివ్య ఆదేశించారు. సీనియర్ నేత యనమల రాజేష్ పర్యవేక్షణలో కాకినాడ జిల్లా, తొండంగి మండలం ఒంటిమామిడిలో సర్పంచ్ అంగుళూరి సుధాకర్ అధ్యక్షతన ప్రజాదర్బార్ జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రభుత్వ విఫ్ యనమల దివ్య ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.వారి నుంచి వినతులు స్వీకరించిన ఆమె చాలా సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించగా ప్రధాన సమస్యల అర్జీలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల సమస్యలకు సత్వర పరిష్కారం చూపించే లక్ష్యంతో ప్రజాదర్బార్లు నిర్వహిస్తున్నామన్నారు. ఒంటిమామిడి పంచాయితీ ఈ రెండేళ్లలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ ప్రజా అవసరాలను పరిష్కరించడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు.

**ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ**

అంతకు ముందు సీనియర్ నేత యనమల రాజేష్,మండల టీడీపీ అధ్యక్షుడు చొక్కా అప్పారావు, సర్పంచ్ అంగుళూరి సుధాకర్, స్థానిక కూటమి నాయకులతో కలిసి ఎమ్మెల్యే యనమల దివ్య ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణి చేసారు. కూటమి శ్రేణులతో కలిసి ఇంటింటికీ వెళ్ళి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్న యనమల దివ్య పెన్షన్ నగదును అందజేసారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అందరి సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నా సంక్షేమ పథకాలను నిరాటంకంగా కొనసాగిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కింతాడ యేసేబు, పెదపూడి గవరయ్య, కోస్టర్ రాజాన రామకృష్ణ, బొట్టా అయ్యప్ప, యనమల లక్ష్మణరావు, బత్తుల ధర్మరాజు, ఖండవల్లి అశోక్ తదితరులు పాల్గొన్నారు.



# నీటి విడుదల పేరుతో చంద్రబాబు హైడ్రామా..

- వైఎస్ఆర్ అంటే పోలవరం.. పోలవరం అంటే వైఎస్ఆర్
- జగన్ రెక్కల కష్టాన్ని చంద్రబాబు దోచుకుంటున్నారు..
- ప్యాకేజీలు అమాంతం పెంచి కోట్లు అవినీతికి పాల్పడ్డారు..
- చంద్రబాబు తలతిక్క పనులతోనే పోలవరం నాశనం
- క్రిమినల్ కేసులు పెట్టి విచారణ జరిపించాలి..
- వెలిగొండ ప్రాజెక్టు ఘనత కూడా మాజీ సిఎం జగన్ దే..
- కరోనా రాకపోతే మేమే అన్ని ప్రాజెక్టులు పూర్తి చేసేవాళ్లం..
- అనకాపల్లి సభలో సిఎం చంద్రబాబు స్పష్టత ఇవ్వాలి..
- అలా చేయకపోతే అన్ని ఆధారాలతో బయటపెడతాం..
- మాజీ ఎంపీ, వైసీపీ అధికార ప్రతినిధి మార్గాని భరత్



**రాజమహేంద్రవరం, సెప్టెంబర్ 1, విశ్వం వాయిస్ న్యూస్ :** చంద్రబాబు తన మామ కుర్చీ చోరీ చేసినట్టుగా వైసిపి చేపట్టిన ప్రాజెక్టులను, పథకాలను క్రెడిట్ చోరీ చేయడానికి చూస్తున్నారని మాజీ ఎంపీ, వైసిపి జాతీయ అధికార ప్రతినిధి, సిటీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మార్గాని భరత్ రామ్ విమర్శించారు. ఇప్పుడు పోలవరం నుంచి గ్రావిటీపై ఒక్క చుక్క నీరు ఇవ్వకుండా పురుషోత్తపట్నం నుంచి గోదావరి జలాలను ఏలేరు రిజర్వాయర్‌కి ఎత్తి పోస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ విషయంలో అనకాపల్లి వద్ద ఈనెల 2వ తేదీ బుధవారం సభ నిర్వహించి రాష్ట్ర ప్రజలను మరోసారి మోసం చేయడానికి ప్రయత్నిస్తున్నారని ధ్వజమెత్తారు. స్థానిక వివెల్ పురం మార్గాని ఎస్టేట్స్‌లో ఉన్న వైసిపి సిటీ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం జరిగిన మీడియా సమావేశంలో మార్గాని భరత్ రామ్ మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు ఎడమ కాలువ పనులను దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి పాలనలోనే 70 శాతం పూర్తి చేసారని గుర్తు చేసారు. అప్పుడు వైఎస్ రాజశేఖర్ రెడ్డి పోలవరం కుడి, ఎడమ కాలువలను తవ్విస్తుంటే కమీషన్లు దోచుకోవడానికి జలయజ్ఞం పేరంతో ధన యజ్ఞం చేస్తున్నారని దుష్ప్రచారం చేయడం వాస్తవం కాదా అని నిలదీసారు. రేపు పోలవరం ఎడమ కాల్వ నీటి విడుదల పేరుతో సీఎం చంద్రబాబు మరోసారి మోసం చేస్తున్నారని ఈ విషయాన్ని ప్రజలు గ్రహించాలని పిలుపునిచ్చారు. పోలవరం ప్రాజెక్టు 45.72 అడుగుల ఎత్తులో నీరు నిల్వ చేసి గ్రావిటీ ద్వారా ఉత్తరాంధ్రకు నీరు వెళుతుందని, ఈ విషయం తెలిసి కూడా కేంద్ర ప్రభుత్వంతో 41.15 మీటర్ల ఎత్తులో మాత్రమే నిర్మాణం చేసేందుకు 30 వేల 43 కోట్లకు సంతకాలు చేసారని ఆరోపించారు. అలా నిర్మాణం చేస్తే పోలవరం కూడా మరొక రిజర్వాయర్, బ్యారేజీగా మిగిలిపోతుందని ఎద్దేవా చేసారు. చంద్రబాబు నిర్లక్ష్యం వల్లనే పోలవరం ప్రాజెక్టు నాశనం అయ్యిందని, ఆయన చేసిన తలతిక్క పనుల వల్లనే డయాఫ్రమ్ వాల్ కొట్టుకుని పోయిందన్నారు. దానికి ఆయనపై క్రిమినల్ కేసులు పెట్టాలని డిమాండ్ చేసారు. జగన్ అధికారంలోకి వచ్చిన వెంటనే స్పిల్ వే, హైడ్రాలిక్ గేట్లు, కాఫర్ డ్యామ్‌ను పూర్తి చేసారని తెలిపారు. ఇంకా పోలవరం కాలువల ప్యాకేజీల విషయంలో అమాంతం అంచనాలు పెంచేసి అవినీతికి తెరతీసారని ఆగ్రహం వ్యక్తం చేసారు. 1996 నుంచి 2004 వరకు 2014-19 వరకు అధికారంలో ఉన్న చంద్రబాబు వెలిగొండ ప్రాజెక్టును ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. వైఎస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్య మంత్రి అయిన తరువాతనే అటవీ శాఖ క్లియరెన్స్‌లు సాధించారని తెలిపారు. నెల్లూరు, కడవ, ఒంగోలు జిల్లాలకు వెలిగొండ నీరు సరఫరా చేసి వేల ఎకరాలు సాగులోకి తేవాలని జగన్ సంకల్పించారని వివరించారు. కరోనాతో రెండున్నరేళ్లు పాలనా పరమైన ఇబ్బందులు లేకపోతే వెలిగొండ, పోలవరం ప్రాజెక్టులు వైసిపి ప్రభుత్వమే పూర్తి చేసి నీరు ఇచ్చేదని పేర్కొన్నారు. చంద్రబాబు నీరు ఎక్కడ నుంచి విడుదల చేస్తే అక్కడ రిబ్బన్ కట్ చేయకుండా నీళ్లు వచ్చేచోట సభ నిర్వహించడం చూస్తేనే విషయం అర్థమవుతోందన్నారు. అక్కడ జరిగే సమావేశంలో ప్రజలకు చంద్రబాబు ఎత్తిపోతల ద్వారా నీరు ఇస్తున్నట్టు స్పష్టత ఇవ్వకపోతే తాము అన్ని ఆధారాలతో సహా చంద్రబాబు కుట్రలను బయట పెడతామని హెచ్చరించారు. ఇది జెన్ జీ జనరేషన్ అని చంద్రబాబు టక్కు టమార విద్యలు చెల్లవని స్పష్టం చేసారు. గతంలో కూడా అలాగే కృష్ణా, గోదావరి నదులను అనుసంధానం చేసామంటూ పవిత్ర సంగమం వద్ద హడావుడి చేసారని ఎద్దేవా చేసారు.

**ఇక్కడా అటువంటి క్రెడిట్ చోరీ ఘనులే ఉన్నారు..**

అక్కడ రాష్ట్రంలో చంద్రబాబు క్రెడిట్ చోరీ చేస్తున్నట్టునే ఇక్కడ సిటీ నియోజకవర్గంలో కూడా చోరీకి పాల్పడుతున్నారని మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ ధ్వజమెత్తారు. క్రెడిట్ చోరీకి చంద్రబాబే అద్యుడన్నారు. తన రెక్కల కష్టంతో సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి సహకారంతో రాత్రింబవళ్లు కష్టపడి మోరంపూడి ఫ్లైఓవర్ నిర్మాణం చేస్తే దాన్ని ఐదుగురు ప్రజా ప్రతినిధులు తాము తెచ్చామంటే తాము తెచ్చామంటే గొప్పలు చెప్పుకుంటున్నారని విమర్శించారు. తాము కట్టించిన ఫ్లైఓవర్‌కు రిబ్బన్ కత్తిరించి క్రెడిట్ చోరీకి పాల్పడుతున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వ పాలనను, ప్రజా ప్రతినిధుల తీరును ప్రజలు గమనిస్తున్నారని సరైన సమయంలో గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని భరత్ రామ్ అన్నారు.

## బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



**రాజమహేంద్రవరం, సెప్టెంబర్ 1, విశ్వం వాయిస్ న్యూస్ :** మూడో వార్డులో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ఆదేశాల మేరకు రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు ఆధ్వర్యంలో ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ప్రజలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వివరాలను ప్రజలకు వివరించారు. అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి కట్టుబడి పనిచేస్తోందని సత్తిబాబు తెలిపారు. పేద, మధ్యతరగతి కుటుంబాల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందన్నారు. ప్రజల అవసరాలను తెలుసుకుని వాటికి అనుగుణంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్ర అభివృద్ధికి అనేక చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. పేద కుటుంబాలకు సంక్షేమ పథకాల ద్వారా ఆర్థిక భరోసా కల్పిస్తున్నట్లు తెలిపారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తున్నట్లు చెప్పారు. సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడం ద్వారా అర్హులైన వారికి ప్రయోజనం చేకూరుతుందన్నారు. బడుగు వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని తెలిపారు. పేదల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తామని పేర్కొన్నారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువ చేయడమే కార్యక్రమం ఉద్దేశమన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని సత్తిబాబు తెలిపారు.

### లబ్ధిదారుల ఇంటి వద్దనే

## పింఛన్ పంపిణీ

### కమిషనర్ రాహుల్ మీనా



**రాజమహేంద్రవరం, సెప్టెంబర్ 1, విశ్వం వాయిస్ న్యూస్ :** అర్హులైన వారందరికీ ప్రభుత్వం పారదర్శకంగా పింఛన్లను పంపిణీ చేస్తున్నట్లు కమిషనర్ రాహుల్ మీనా పేర్కొన్నారు. మంగళవారం ఉదయం శ్యామల నగర్లో ఇంటింటికి వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. లబ్ధిదారుల ఆధార్ కార్డులను పరి శీలించి, ఫేస్ రికగ్నిషన్ సిస్టం ద్వారా చెక్ చేసి పింఛన్ డబ్బులు అందించారు. కేటగిరీల వారీగా లబ్ధిదారులకు పింఛన్ మొత్తాన్ని అంది స్తున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా పింఛన్ దారులతో స్నేహపూర్వకంగా మాట్లా డుతూ వారికి అందుతున్న సౌకర్యాలు, పింఛన్ సాయం ఏవిధంగా ఉపయోగపడుతుందో అడిగి తెలుసుకున్నారు. పెన్షన్ దారులు తమ సం తోషాన్ని వ్యక్తం చేస్తూ.. ప్రభుత్వం చేస్తున్న సేవలకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ.. ప్రతినెలా ఒకటో తేదీనే పింఛన్లు పంపిణీకి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని తెలిపారు. అర్బన్ పరిధిలో పింఛన్ల పంపిణీ నిర్దిష్టంగా ఒకటవ తేదీ ఉదయం నుంచి ప్రారంభం అయిందని.. లబ్ధిదారులు ఎక్కడా అసౌకర్యానికి గురికాకుండా ఉదయం 6 గంటల నుండి సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి ప్రశాంత వాతావరణంలో పింఛన్లు అందజేస్తున్నట్లు వెల్లడించారు. సెప్టెంబర్ నెలకు సంబంధించిన ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అందించే క్రమంలో నగరంలో 27,239 పింఛనుదారులకు ప్రభుత్వం 12 కోట్ల 3 లక్షల 29 వేల రూపాయలు విడుదల చేసిందన్నారు. సాయంత్రానికల్లా పంపిణీ కార్యక్రమం అత్యంత పారదర్శకంగా, శత శాతం పూర్తిచేయ వలసిందిగా సంబంధిత అధికారులను ఆదే శించారు. ఆయన వెంట సెక్రటరీ శైలజవల్లి, ఎంహెచ్ఓ వినూత్న, ఇతర అధికారులు, సిబ్బంది ఉన్నారు.

### పుష్కరాల నిధులతో

## డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం

- రూ.140 కోట్ల పుష్కర పనుల్లో 39వ డివిజన్ ప్రధాన డ్రైనేజీ అభివృద్ధికి ప్రాధాన్యం..
- మరో రూ.300 కోట్ల పనులకు త్వరలో టెండర్లు : ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ వెల్లడి
- రూ. 30 లక్షలతో 39వ డివిజన్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**రాజమహేంద్రవరం, సెప్టెంబర్ 1, విశ్వం వాయిస్ న్యూస్ :** పుష్కరాల అభివృద్ధి పనుల్లో భాగంగా నగరంలోని ముంపు సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా ప్రభు త్వం చర్యలు చేపడుతోందని రాజమహేం ద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీని వాస్ అన్నారు. ఇప్పటికే రూ.140 కోట్లతో పబ్లిక్ హెల్త్ విభాగం ద్వారా చేపట్టనున్న పుష్కర పనుల్లో డ్రైనేజీ అభివృద్ధికి ప్రాధాన్యం కల్పించామని, మరో రూ.300 కోట్ల విలువైన పనులకు కూడా నిధులు మంజూర వుతున్నాయని, త్వరలో టెండర్లు పిలుస్తామని చెప్పారు. స్థానిక 39వ డివిజన్‌లోని సాయిబాబా ఆలయం నుంచి పేపర్ మిల్లు పుంత రోడ్డు మీదుగా యాళ్లవారి వీధి అభివృద్ధి పనులకు రూ.30 లక్షలతో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్... టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి యర్రా వేణు గోపాల రాయుడు, 39వ డివిజన్ ఇంచార్జ్, హితకారిణి సమాజం చైర్మన్ యాళ్ల ప్రదీప్ తదితరులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో 2019-24 మధ్య 39వ డివిజన్‌లోని పలు ప్రాంతాలు వర్షం పడిన ప్రతిసారీ స్విమ్మింగ్ పూల్‌ను తలపించేలా నీటమునిగేవన్నారు. ప్రధాన డ్రైనేజీ వ్యవస్థ శిథిలావస్థకు చేరడంతోపాటు, కల్వర్టు సదుపాయం లేకపోవడం వల్ల మురుగునీరు, వర్షపు నీరు నిలిచిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులుఎదుర్కొన్నారని తెలిపారు. నీరు నిలిచిపోవడంతో ప్రధాన డ్రైనేజి పక్కనే ఉన్న భవనం పునాదులు సైతం దెబ్బతింటున్నా గత పాలకులు పట్టించుకోలేదని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు సమస్యను శాశ్వతంగా పరిష్కరించే దిశగా పనులు చేపట్టామని చెప్పారు. ప్రధాన డ్రెన్‌కు కల్వర్టు నిర్మించి నీటి ప్రవాహాన్ని మళ్లించడంతోపాటు, కొత్త డ్రైనేజీని నిర్మిస్తున్నామని, రోడ్డు ఎత్తును పెంచుతున్నామని వివరించారు. దీనికి సమాంతరంగా మరో రహదారిని నిర్మించి, ఇరువైపులా డ్రైనేజీలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. 39వ డివిజన్‌లోని తుమ్మలోవ, లింగంపేట తదితర ప్రాంతాల్లోనూ ముంపు సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అశోక్ కళ్యాణ మండపం సమీప ప్రాంతాల్లో కూడా నీటిముంపు సమస్య ఉందని, దానికి సుమారు రూ.25 కోట్లతో చేపట్టనున్న ప్రధాన పనులను పుష్కరాల అభివృద్ధి కార్యక్రమాల్లో చేర్చామని వివరించారు. అలాగే స్వతంత్ర హాస్పిటల్ సమీపంలోనూ గతంలో తీవ్ర ఇబ్బందులు ఉండేవని, కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అక్కడ రహదారి, డ్రైనేజీ సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు. 30 ఏళ్లుగా సమస్యగా ఉన్న లింగంపేట రెండో వీధి డ్రైనేజీ సమస్యకు కూడా పరిష్కారం చూపుతున్నామన్నారు. పుష్కరాల అభివృద్ధి పనులకు సంబంధించి త్వరలో మరో రూ.300 కోట్ల నిధులు మంజూరు కానున్నాయని, వాటికి త్వరలోనే టెండర్లు తెరవనున్నామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, అధికారులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎల్ఐసీ 70వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు




**గోకవరం, సెప్టెంబర్ 1, విశ్వం వాయిస్ న్యూస్ :** ఎల్ఐసీ కార్యాలయంలో ఎల్ఐసీ 70వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. బ్రాంచ్ మేనేజర్ డి.ఎస్.వి. సూర్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తొలుత ఎల్ఐసీ నిగమ్ గీత్ ఆలపించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ మాట్లాడుతూ పాలసీదారులకు ఎల్ఐసీ అందిస్తున్న విశిష్ట సేవలను కొనియాడారు. ప్రపంచంలోనే ప్రముఖ జీవిత బీమా సంస్థల్లో ఎల్ఐసీ మూడో స్థానంలో ఉందని తెలిపారు. బ్రాంచ్ మేనేజర్ డి.ఎస్.వి. సూర్యనారాయణ మాట్లాడుతూ 1956 సెప్టెంబర్ 1న సుమారు రూ.5 కోట్లతో ప్రారంభమైన ఎల్ఐసీ సంస్థ దినదినాభివృద్ధి చెందుతూ ప్రస్తుతం రూ.59.03 లక్షల కోట్ల నికర ఆస్తులు కలిగి ఉందన్నారు. సుమారు 30 కోట్ల మంది పాలసీదారులతో, భారత మార్కెట్‌లో 65.16 శాతం వాటాతో, డెత్ క్లెయిమ్ సెటిల్‌మెంట్‌లో 99.44 శాతం సాధిస్తూ దేశ బీమా రంగంలో అగ్రగామిగా కొనసాగుతోందన్నారు. ఎల్ఐసీ ఆవిర్భావ వారోత్సవాలను ఏడు రోజులపాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా విద్యార్థినీ, విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో అధికారులు కె. పోతురాజు, పి.టి. మారయ్య, ఎంప్లాయిస్ యూనియన్ ప్రెసిడెంట్ కె. మురళీకృష్ణ ప్రసాద్, సెక్రటరీ జి. రాధాకృష్ణ, జాయింట్ సెక్రటరీ ఎం. సత్యనారాయణ, ట్రెజరర్ లీలా కృష్ణ, డెవలప్‌మెంట్ ఆఫీసర్ చంద్రమౌళి, కార్యాలయ సిబ్బంది, ఎల్ఐసీ ఏజెంట్స్ అసోసియేషన్ సెక్రటరీ నాగరపు నాగరాజు, చోడిశెట్టి గుప్తా, కరిబండి నాగేశ్వరరావు, పడమటి నాగేశ్వరరావు, కరిబండి విష్ణు, మసిముక్కుల రామకృష్ణ, కె. రామకృష్ణ, టి. సుబ్రమణ్యం, జీఎంఆర్ బాబ్జి, మెప్పెల్లి జయరాజు తదితర ఏజెంట్లు పాల్గొన్నారు.

## పారిశుధ్యంలో లోపాలు లేకుండా చర్యలు చేపట్టాలి : కమిషనర్



**రాజమహేంద్రవరం, సెప్టెంబర్ 1, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రతిరోజు వ్యర్థాల సేకరణ, శాస్త్రీయ నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టి పారిశుధ్య నిర్వహణ పనులలో లోపాలు లేకుండా చర్యలు తీసుకోవాలని కమిషనర్ రాహుల్ మీనా పేర్కొన్నారు. మంగళవారం ఉదయం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా శ్యామలనగర్లో పర్యటించి.. ప్రజలకు అందుతున్న పారిశుధ్య సేవలు, పార్కుల నిర్వహణను పరిశీలించారు. పార్కుల వద్ద పేరుకుపోయిన చెత్తను హార్టికల్చర్, పబ్లిక్ హెల్త్ సిబ్బంది ఎప్పటికప్పుడు సమన్వయంతో తొలగించాలని సూచించారు. అలాగే ఉదయం 7 గంటల కల్లా మెయిన్ రోడ్ల క్లీనింగ్ పూర్తి కావాలని ఆదేశించారు. నైట్ శానిటేషన్ పై నిరంతర పర్యవేక్షణ తప్పనిసరి అని.. పారిశుధ్య కార్మికులు ప్రధాన రహదారులపై విధులు నిర్వహించే సమయంలో వారి భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రధాన రహదారులు, అంతర్గత వీధుల్లో ఎక్కడా చెత్త కుప్పలు పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, వెంటనే తొలగించే చర్యలు చేపట్టాలన్నారు. అలాగే సాలిడ్ వేస్ట్ మేనేజ్ మెంట్ నిబంధనలకు అనుగుణంగా ప్రజలు తడి, పొడి, ప్రమాదకర వ్యర్థాలను వేర్వేరుగా అందించేలా.. ప్రతివార్డులో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఆయన వెంట ఎంహెచ్ఓ వినూత్న, ఇతర సిబ్బంది ఉన్నారు.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY
సువర్ణావకాశం
₹99/- లకే మీ ప్రకటన!
స్థానిక వ్యాపారాన్ని పదిమందికి పరిచయం చేయండి! అత్యంత తక్కువ ధరకే క్లాసిఫైడ్స్.
ఇల్లు అమ్మకాలు / అద్దెలు
వాహనాల అమ్మకం
ట్యూషన్ & & విద్య
ఉద్యోగ అవకాశాలు
సర్వీసు& రిపేర్లు
ఇతర ప్రకటనలు
ఎందుకు విశ్వం వాయిస్?
అత్యంత తక్కువ ధర (₹99 మాత్రమే)
కాకినాడ పరిధిలో విస్తృత ప్రచారం
సోషల్ మీడియాలోనూ ఉచిత ప్రమోషన్
ఇప్పుడే సంప్రదించండి: 9246033999, 7579339999 9246033999 కాకినాడ కార్యాలయం




సినిమాల్లో ఎంతో మంది హీరోయిన్స్ తక్కువ సినిమాలతోనే ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు. మంచి సినిమా పడితే స్టార్స్ గా మారిపోవాలని హీరోయిన్స్ ప్రయత్నిస్తున్నారు. దాంతో మంచి ఛాన్స్ దొరికితే తమ టాలెంట్ మొత్తం చూపించడానికి, అలాగే ఎలాంటి సాహసమైన చేయడానికి హీరోయిన్స్ రెడీ అవుతున్నారు. సినిమా ఇండస్ట్రీలో చాలా మంది హీరోయిన్స్ తక్కువ సినిమాలతోనే ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు. మంచి సినిమా పడితే స్టార్స్‌గా మారిపోవాలని హీరోయిన్స్ ప్రయత్నిస్తున్నారు. దాంతో మంచి ఛాన్స్ దొరికితే తమ టాలెంట్ మొత్తం చూపించడానికి, అలాగే ఎలాంటి సాహసమైన చేయడానికి హీరోయిన్స్ రెడీ అవుతున్నారు. అయితే కొంతమంది ముద్దుగుమ్మలు కొన్ని సినిమాలతోనే పరిమితం అవుతున్నారు. వరుసగా సినిమాలు చేసి ఆ తర్వాత అవకాశాలు లేక సోషల్ మీడియాతోనే గడిపేస్తున్న హీరోయిన్స్ చాలా మంది ఉన్నారు. వారిలో ఈ అమ్మడు ఒకరు. ఈ చిన్నది చేసింది 12 సినిమాలు కానీ హిట్స్ మాత్రం ఒకటి రెండు మాత్రమే.. హిందీలోనూ ట్రై చేసింది కానీ.. అక్కడా లాభం లేకుండా పోయింది. దాంతో సోషల్ మీడియాలో అరాచకం చేస్తుంది. ఓ రేంజ్ లో అందాలు ఆరబోస్తుంది. అవకాశాలు లేక తన గ్లామర్ తో దర్శక నిర్మాతలను ఆకర్షిస్తున్న ఈ అమ్మడు ఎవరో కాదు.. తెలుగులో చేసిన మొదటి సినిమాతోనే మంచి విజయాన్ని అందుకుంది. తన అందం, అభినయంతో కట్టిపడేసింది. కానీ ఆతర్వాత అంతగా సక్సెస్ అందుకోలేకపోయింది. వరుసగా సినిమాలు చేసినప్పటికీ అంతగా హిట్స్ అందుకోలేదు. ఆమె ఎవరో కాదు బోల్డ్ బ్యూటీ సీరత్ కపూర్. శర్వానంద్ హీరోగా నటించిన రన్ రాజా రన్ సినిమాతో టాలీవుడ్ లోకి అడుగుపెట్టింది. ఆతర్వాత ఈ అమ్మడు బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో మెప్పించింది. ఆతర్వాత తెలుగులో ఎక్కడా కనిపించలేదు ఈ చిన్నది. రన్ రాజా రన్ సినిమా తర్వాత కొన్ని సినిమాలు చేసింది..కానీ.. ఈ ముద్దుగుమ్మకు అనుకున్నంతగా గుర్తింపు రాలేదు. దీంతో అవకాశాలు సైతం తగ్గిపోయాయి. స్పెషల్ సాంగ్స్ కూడా చేసింది కానీ అంతగా గుర్తింపు రాలేదు. అయితే ఈ హీరోయిన్ ఇప్పుడు సోషల్ మీడియాలో ఫుల్ యాక్టివ్ అయ్యింది. 2015లో సందీప్ కిషన్ నటించిన టైగర్ చిత్రంలో నటించింది. ఇక ఆ తర్వాత కొలంబస్, రాజు గారి గది 2, టచ్ చేసి చూడు, ఒక్క క్షణం చిత్రాల్లో నటించింది. అయితే ఈ సినిమాలన్ని బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్స్ కాగా.. ఈ అమ్మడుకు మాత్రం మంచి క్రేజ్ వచ్చింది. బాలీవుడ్ ఇండస్ట్రీలో కొరియోగ్రాఫర్ గా చేసిన సీరత్ కపూర్.. ఆ తర్వాత నటనపై ఆసక్తితో హీరోయిన్ గా అడుగుపెట్టింది. ప్రస్తుతం సోషల్ మీడియాలో తెగ హల్ చల్ చేస్తుంది ఈ చిన్నది.

# ఆది పినిశెట్టి, నిక్కీ గల్రాని విడాకులు..

**క్లారిటీ ఇచ్చిన హీరో! అసలు మ్యాటర్ ఏంటంటే..**



యంగ్ అండ్ టాలెంటెడ్ యాక్టర్ ఆదిపినిశెట్టి. హీరోగా రాణిస్తూనే మరో వైపు విలన్ గాను మెప్పిస్తున్నాడు. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ నటించిన సరైనోడు సినిమాలో ఆది పవర్ ఫుల్ విలన్ పాత్రలో కనిపించి ఆకట్టుకున్నాడు. రీసెంట్ గా అఖండ 2 సినిమాలో విలన్ గా నటించి మెప్పించారు. నటుడు ఆది పినిశెట్టి ఓ ఇంటర్వ్యూలో తన వ్యక్తిగత జీవితం, తన వివాహం, నిక్కీ గల్రానితో అనుబంధం, విడాకుల పుకార్లపై స్పష్టత ఇచ్చారు. ఒక స్టార్‌గా, ఆది పినిశెట్టికి వేలాది ప్రపోజల్స్ వస్తాయని, సోషల్ మీడియా ఇన్బాక్స్‌లు నిండిపోతాయని యాంకర్ ప్రశ్నించగా, తాను సాధారణంగా వాటిని పట్టించుకోనని ఆది బదులిచ్చారు. కేవలం సినిమా ప్రమోషన్ల సమయంలో ట్యాగ్‌లు, మెసేజ్‌లు చూస్తానని, కానీ మిగతా సమయాల్లో చూడటానికి సమయం కూడా ఉండదని అన్నారు. జనాల్లోకి వెళ్లడానికి, సాధారణ ప్రజలతో కనెక్ట్ అవ్వడానికి మాస్క్ ధరించి పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ (బస్సు, మెట్రో) లో ప్రయాణిస్తానని, సాధారణ దుస్తులు ధరిస్తానని తెలిపారు. తన హెయిర్‌స్టైల్ మాత్రమే తనను గుర్తించేలా చేస్తుందని, షూటింగ్‌లు లేనప్పుడు చాలా సాధారణంగా ఉంటానని చెప్పారు. చెన్నైలోని ఐలాండ్ గ్రౌండ్స్‌లో జరిగే ఎగ్జిబిషన్‌లను సందర్శించడం తనకు ఇష్టమని, ఆ విధంగా ప్రజలతో మమేకమవుతానని వివరించారు. వేలాది మంది ప్రపోజల్స్‌ను కాదని నిక్కీని ఎందుకు ఎంచుకున్నారని అడిగినప్పుడు, నిక్కీ తన జీవితంలో రైట్ పర్సన్ అని ఆది పేర్కొన్నారు. ఆమె మొదట తనకు మంచి స్నేహితురాలని, తన కుటుంబంతో, తన సోదరుడితో నిక్కీకున్న బంధం నిజమైనదని, అది కాలంతో పాటు మసకబారేది కాదని అన్నారు. నిక్కీ చాలా బాధ్యతగల వ్యక్తి అని, తన పట్ల ఆమెకు స్పష్టమైన అవగాహన ఉంటుందని చెప్పారు. అదే సమయంలో ఆమె సరదాగా ఉండే వ్యక్తి అని, మంచి ట్రావెల్ కంపానియన్ అని, తమ ఇద్దరి మధ్య ఒక భాగస్వామి కంటే ఒక స్నేహితుడితో ఉన్న భావన కలుగుతుందని ఆది అన్నారు. తాను, నిక్కీ విడాకులు తీసుకుంటున్నారని వచ్చిన వార్తలపై ఆది తీవ్రంగా స్పందించారు. ఈ వార్త చూడగానే తనకు షాకింగ్‌గా అనిపించిందని, సంబంధమే లేకుండా ఇలాంటి వార్తలు ఎలా రాశారని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. అయితే, సినీ రంగంలో ఉన్నవారు చిన్న విషయాలకు సున్నితంగా ఉండరని, మరింత దృఢంగా మారుతారని ఆది వివరించారు. ప్రతిరోజూ తిరస్కరణలను, 250 మంది వ్యక్తులతో పని చేసేటప్పుడు ఎదురయ్యే విభిన్న పరిస్థితులను ఎదుర్కొంటామని చెప్పారు. అలాంటి వార్తలు వచ్చినప్పుడు కొద్దిసేపు బాధ అనిపించినా, దానిని పట్టించుకోవద్దని నిర్ణయించుకుంటానని అన్నారు. తాము సీరియస్‌గా తీసుకోని వారిని మనం ఎందుకు సీరియస్‌గా తీసుకోవాలి అని ప్రశ్నిస్తూ, ఇలాంటి పుకార్లను నివారించడమే మంచిదని సూచించారు. సినిమా రివ్యూలను మాత్రం తాను అంగీకరిస్తానని, వాటి నుంచి నేర్చుకోవడానికి ప్రయత్నిస్తానని తెలిపారు.




**క్రికెట్ హిస్టరీలో ఫాస్టెస్ట్ బాల్ వేసినోడు తెలుసు..**

# ఆ బాల్ ఆడిన మొగోడు ఎవడో తెలుసా?




పాకిస్థాన్ మాజీ పేసర్ షోయబ్ అక్తర్ 2003 ప్రపంచకప్‌లో ఇంగ్లండ్‌పై 161.3 కిలోమీటర్ల వేగంతో బంతి వేసి చరిత్ర సృష్టించాడు. కేప్‌టౌన్‌లో జరిగిన మ్యాచ్‌లో ఈ రికార్డు డెలివరీని ఇంగ్లండ్ ఓపెనర్ నిక్ నైట్ ఎదుర్కొన్నాడు. గంటకు 100.23 మైళ్ల వేగంతో నమోదైన ఈ బంతి, ఇప్పటికీ అత్యంత వేగవంతమైన అధికారిక డెలివరీగా గుర్తింపు పొందింది. క్రికెట్ చరిత్రలో అత్యంత వేగవంతమైన బంతి అంటే ముందుగా గుర్తొచ్చే పేరు పాకిస్థాన్ మాజీ ఫాస్ట్ బౌలర్ షోయబ్ అక్తర్. అతని రన్‌అప్‌కి, అతని బౌలింగ్‌కు భయపడే బ్యాటర్లు చాలా మందే ఉన్నారు. ప్రపంచ క్రికెట్‌లో అత్యంత వేగవంతమైన బాల్ వేసిన బౌలర్‌గా ఇప్పటికీ అక్తర్ పేరు క్రికెట్‌లో చెక్కు చెదరకుండా ఉంది. 2003 ప్రపంచకప్‌లో ఇంగ్లండ్‌తో జరిగిన మ్యాచ్‌లో అక్తర్ ఏకంగా 161.3 కిలోమీటర్ల వేగంతో బంతిని వేసి చరిత్ర సృష్టించాడు. గంటకు 100.23 మైళ్ల వేగంతో నమోదైన ఈ డెలివరీ ఇప్పటికీ అత్యంత వేగమైన బంతిగా గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ పేర్కొంటోంది.

### ఆ బంతిని ఎదుర్కొన్న బ్యాటర్ ఎవరు?

చాలా మందికి బాల్ వేసిన అక్తర్ గుర్తున్నాడు కానీ, అంత వేగంతో వచ్చిన బంతిని సాలిడ్‌గా డిఫెన్స్ చేసి, ఏ మాత్రం భయపడుకుండా ఆడిన బ్యాటర్ గురించి చాలా మందికి తెలియకపోవచ్చు. అయితే ఈ చారిత్రక డెలివరీని ఎదుర్కొన్న ఇంగ్లండ్ ఓపెనర్ నిక్ నైట్. 2003 ఫిబ్రవరి 22న దక్షిణాఫ్రికాలోని కేప్‌టౌన్ న్యూలాండ్స్ మైదానంలో పాకిస్థాన్, ఇంగ్లండ్ మధ్య ప్రపంచకప్ గ్రూప్ మ్యాచ్ జరిగింది. ఆ మ్యాచ్‌లోనే అక్తర్ 161.3 కిలోమీటర్ల వేగాన్ని అందుకున్నాడు. అయితే ఆ బాల్‌ను నిక్ నైట్ సింపుల్‌గా డిఫెన్స్ ఆడేశాడు. ఆ బాల్‌కే కాదు, ఆ ఓవర్‌లో ఒక్క రన్ కూడా ఇవ్వలేదు అక్తర్.

### మ్యాచ్‌లో ఏం జరిగింది?

అయితే అక్తర్ ఈ రికార్డు సృష్టించినప్పటికీ పాకిస్థాన్‌కు ఆ మ్యాచ్‌లో విజయం దక్కలేదు. ఇంగ్లండ్ ఘన విజయం సాధించింది. ప్రపంచకప్‌లో పాకిస్థాన్‌కు ఆ మ్యాచ్ చేదు అనుభవంగా మిగిలినా, అక్తర్ వేసిన వేగం మాత్రం క్రికెట్ చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోయింది. ప్రపంచకప్ సమయంలో 160 కిలోమీటర్ల మార్కును దాటిన బౌలర్లలో అక్తర్‌తో పాటు ఆస్ట్రేలియాకు చెందిన బ్రెట్ లీ కూడా ఉన్నాడు. లీ అత్యధికంగా 160.7 కిలోమీటర్ల వేగాన్ని నమోదు చేశాడు.

# అఫ్గాన్‌తో టీ20 సిరీస్.. భారత జట్టు ఇదే..



ఆఫ్గానిస్థాన్‌తో ఈ నెల 13 నుంచి ప్రారంభం కానున్న టీ20 సిరీస్‌కు సంబంధించి భారత జట్టును బీసీసీఐ సెలక్షన్ కమిటీ ప్రకటించింది. భారత స్టార్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా తిరిగి జట్టులోకి వచ్చాడు. గాయంతో చాన్నాళ్లుగా జట్టుకు దూరమైన ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యను జట్టులోకి తీసుకోలేదు. అతడి కాలికి మరోసారి గాయం కావడంతోనే జట్టులోకి తీసుకోలేదని సమాచారం. శ్రేయస్ అయ్యర్ జట్టుకు నాయకత్వం వహించనున్నాడు. తెలుగు కుర్రాడు తిలక్ వర్మ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. జింబాబ్వే పర్యటనలో రాణించిన యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీ జట్టులో తన స్థానాన్ని నిలబెట్టుకున్నాడు. జింబాబ్వే సిరీస్‌కు దూరమైన సంజూ శాంసన్, నితీశ్ కుమార్ రెడ్డి, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, రవి బిష్ణోయ్, అర్ష్‌దీప్‌సింగ్, హర్షిత్ రాణా తిరిగి జట్టులోకి వచ్చారు. బుమ్రా, నితీశ్, వాషింగ్టన్ సుందర్, హర్షిత్ రాణా సెలక్ట్ అయినప్పటికీ వారికి ఫిట్‌నెస్ క్లియరెన్స్ రావాల్సి ఉంది. గత జింబాబ్వే సిరీస్‌లో ఆడిన ఎనిమిది మంది ప్లేయర్లు.. సూర్యాంశ్ షెడ్గే, రింకూ సింగ్, హర్ష్ దూబె, ప్రిన్స్ యాదవ్, యశ్ ఠాకూర్, అశోక్ శర్మ, మయాంక్ యాదవ్, ప్రభ్‌సిమ్రన్ సింగ్ ఈ సిరీస్‌కు ఎంపిక కాలేదు. దిల్లీ వేదికగా అఫ్గాన్‌తో భారత్ మూడు టీ20లు ఆడనుంది. సెప్టెంబర్ 13, 15, 17 తేదీల్లో ఈ మ్యాచ్‌లు జరుగుతాయి.

**భారత జట్టు:** శ్రేయస్ అయ్యర్, అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ, సంజూ శాంసన్, ఇషాన్ కిషన్, తిలక్ వర్మ, శివమ్ దూబె, నితీశ్ కుమార్ రెడ్డి, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్, జస్‌ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణా.

# బిగ్‌ట్విస్ట్.. ముంబయితోనే హార్దిక్.. కెప్టెన్‌గా తిలక్ వర్మ




ముంబయి ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్య ట్రేడింగ్‌పై కొత్త అంశం తెరపైకి వచ్చింది. హార్దిక్‌ను ట్రేడ్ చేయకుండా ఆటగాడిగా జట్టులో కొనసాగించి, కెప్టెన్సీ మరొకరికి అప్పగించాలని ముంబయి భావిస్తోందట. పాండ్యను ట్రేడ్ చేయడం కోసం కోల్‌కతా నైట్‌రైడర్స్‌ను ముంబయి ఇండియన్స్ సంప్రదించిందట. అయితే, సరైన ప్రత్యామ్నాయ ఆటగాడు లేకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. కెప్టెన్‌గా కొత్తవారిని ఎంపిక చేసేందుకు ముంబయి కసరత్తు చేస్తోందని సమాచారం. కొత్త సారథి ఎంపికలో రోహిత్ శర్మ కీలకపాత్ర పోషిస్తున్నాడని, ఇప్పటికే జట్టు యాజమాన్యంతో చర్చలు జరుపుతున్నట్లు టాక్ నడుస్తోంది. కెప్టెన్సీ రేసులో సీనియర్ ప్లేయర్ జస్‌ప్రీత్ బుమ్రాతోపాటు యువ ఆటగాడు తిలక్ వర్మ పేర్లు వినిపిస్తున్నాయి. అయితే, జట్టు దీర్ఘకాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని తిలక్ వర్మ వైపే మొగ్గు చూపే అవకాశాలున్నాయని సమాచారం. "హార్దిక్‌ను అసలు ట్రేడ్ చేయకపోయినా ఆశ్చర్యపోకండి. ఈ విషయమై ఆటగాడితో చర్చలు కూడా జరిగాయి. ఒక ట్రేడ్ జరగాలంటే చాలా విషయాలు ఒక కొలిక్కి రావాలి. ఇది అంత తేలికైన విషయం కాదు" అని ఫ్రాంచైజీ సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. మహేల జయవర్ధనెను కోచ్‌గా తొలగిస్తారని మొన్నటివరకు వార్తలు వచ్చాయి. అయితే, వచ్చే సీజన్‌కు అతనే కోచ్‌గా ఉండే అవకాశముందట. చివరి నిమిషంలో ఎలాంటి మార్పులు లేకపోతే వచ్చే నెలలో అధికారిక ప్రకటన వెలువడే ఛాన్స్ ఉందని సమాచారం. సూర్యకుమార్ యాదవ్ గతేడాది మెరుగైన ప్రదర్శన చేయకపోయినప్పటికీ ఈ అనుభవజ్ఞుడైన ఆటగాడిని వదులుకునేందుకు ముంబయి సిద్ధంగా లేదని తెలుస్తోంది. "అవును.. గత సీజన్‌లో సూర్యకుమార్ బాగా ఆడలేదు. కానీ, అంతకు ముందు సీజన్ల సంగతేంటి?కేవలం ఒక ఏడాది ప్రదర్శన ఆధారంగా ముంబయి ఇండియన్స్ ఒక ఆటగాడిని పక్కనపెట్టదు. వారు ఆ విధంగా వ్యవహరించరు. వాళ్లు 'వన్ ఫ్యామిలీ' అనే ట్యాగ్‌ను గర్వంగా భావిస్తారు. దానికే కట్టుబడి ఉంటారు" అని సంబంధిత వర్గాలు తెలిపాయి.




VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com